JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | మంగళవారం 30-12-2025
Medchal - Malkajgiri | Tuesday 30-12-2025
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 214
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 214 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com



## వైకుంఠ ఏకాదశి భద్రతా ఏర్పాట్లు

- వైకుంఠ ఏకాదశి నేపథ్యంలో భద్రతా ఏర్పాట్ల పరిశీలించిన తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు
- చంద్రగిరి మెట్టు, అప్పలాయగుంట, అలిపిరి పాదాలు ప్రాంతాల్లో బందోబస్తు సమీక్ష
- భక్తుల రద్దీ సమయంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి ఆదేశాలు.
- భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని స్పష్టం చేసిన జిల్లా ఎస్పీ
- అన్ని కీలక ప్రాంతాలు కామన్ కమాండ్ కంట్రోల్
- సీసీ కెమెరాల అనుసంధానం.
- టీటీడీ పోలీస్ సమన్వయంతో భద్రతా చర్యలు



**జయభేరి, తిరుపతి :**

తిరుమల శ్రీవారి వైకుంఠ ఏకాదశి పర్వదినాలను పురస్కరించుకుని, తిరుపతిలో భక్తుల రాకపోకలు అధికంగా ఉండనున్న నేపథ్యంలో, తిరుపతి జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు, ఈరోజు ఉదయం వివిధ ప్రాంతాల్లో అమలు చేస్తున్న భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ చంద్రగిరి శ్రీవారి మెట్టు, అప్పలాయగుంట, అలిపిరి పాదాలు తదితర కీలక ప్రాంతాలను సందర్శించి, భక్తుల సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు విధులు, రద్దీ నిర్వహణ చర్యలను సమీక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చిన సందర్భాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్ మరియు సంబంధిత సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ భక్తులకు అసౌకర్యం లేదా

...మిగతాది 2 లో



# అసెంబ్లీకి హాజరైన బీఆర్ఎస్ అధినేత

- అసెంబ్లీకి హాజరైన బీఆర్ఎస్ అధినేత
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆయనకు ఘన స్వాగతం
- అసెంబ్లీలో కేసీఆర్ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి
- దివంగత నేత ఆర్. దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డిలకు సభ సంతాపం
- సభ నుంచి ఎందుకు వెళ్లిపోయారో కేసీఆర్నే అడగండి: రేవంత్ రెడ్డి
- కేటీఆర్ తీరుపై కాంగ్రెస్ విమర్శలు

**జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 29:**

తెలంగాణ అసెంబ్లీలో సోమవారం నాడు అత్యంత ఆసక్తికరమైన, హుందాతనంతో కూడిన సన్నివేశం చోటుచేసుకుంది. అదే సమయంలో జరిగిన ఘటన రాజకీయంగా హాట్ టాపిక్ అవుతోంది. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభలోకి వచ్చిన సందర్భంలో ప్రతిపక్ష నేత, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ వద్దకు వెళ్లి ఆయన యోగక్షేమాలను సరదాగా పలకరించారు. తెలంగాణకు తొలి ముఖ్యమంత్రిగా రెండు సార్లు బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఉన్నప్పటికీ, కేసీఆర్ తన సంస్కారాన్ని చాటుకుంటూ రేవంత్ రెడ్డి రాకను గమనించి వెంటనే లేచి నిలబడి ప్రతి నమస్కారం చేశారు. రేవంత్ రెడ్డికి స్వయంగా షేక్ హ్యాండ్ ఇచ్చి తన హుందాతనాన్ని ప్రదర్శించారు. రాజకీయ విభేదాలను పక్కన పెట్టి, మరొకరి హోదాను గౌరవించుకుంటూ సాగిన ఈ అరుదైన కలయిక సభలో అందరి దృష్టిని ఆకర్షించింది. రేవంత్ రెడ్డి చూపిన మర్యాద, కేసీఆర్ స్పందించిన తీరుపై ప్రస్తుతం సర్వత్రా ప్రశంసలు కురుస్తున్నాయి.ఇదే సమయంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రవర్తనపై సోషల్ మీడియాలో భిన్నమైన చర్చ నడుస్తోంది. సభా నాయకుడైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ సమీపంలోకి వచ్చినప్పుడు, తమ పార్టీ అధినేత వద్దకు వచ్చి పలకరించగా కేసీఆర్ లేచి నిల్చుని షేక్ హ్యాండ్ ఇచ్చారు. అయితే కేటీఆర్, కౌశిక్ రెడ్డి కనీసం లేచి నిలబడకపోవడంపై కాంగ్రెస్ శ్రేణులు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఇది కేటీఆర్ అహంకారానికి నిదర్శనమని వారు ఆరోపిస్తుంటే, బీఆర్ఎస్ శ్రేణులు మాత్రం దీనిని గట్టిగా సమర్థిస్తున్నాయి.తన తండ్రిపై అనుచిత

...మిగతాది 2 లో

## వెండి ధరల పెరుగుదలపై ఎలాన్ మస్క్ ఆందోళన..




**జయభేరి, న్యూ డిల్లీ, డిసెంబర్ 29 :**

ప్రపంచ మార్కెట్ లో వెండి ధరలు రాకెట్ వేగంతో దూసుకెళ్తున్నాయి. ఇప్పటికే సామాన్యుడికి అందనంత దూరానికి చేరుకున్న వెండి.. రోజుకొక గరిష్ఠ స్థాయికి చేరుకుంటున్నది. గతంలో ఎన్నడూ లేనివిధంగా కిలో వెండి ధర ఏకంగా రూ.2.50 లక్షలు దాటింది.

## ముగింపు దశలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ?

- త్వరలో ట్రంప్, పుతిన్ ఫోన్ కాల్




**జయభేరి, న్యూ డిల్లీ, డిసెంబర్ 29 :**

ప్రపంచవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్న ఉక్రెయిన్ యుద్ధానికి త్వరలోనే తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అతి త్వరలో ఫోన్ ద్వారా సంభాషించుకోనున్నారు. ఈ విషయాన్ని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ సోమవారం ధృవీకరించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు జరుగుతున్న దౌత్యపరమైన చర్చలు తుది దశకు చేరుకున్నాయని ట్రంప్ వ్యక్తం చేసిన అభిప్రాయంతో రష్యా ఏకీభవిస్తోందా అని విలేకరులు ప్రశ్నించగా.. పెస్కోవ్ "తప్పకుండా" అని బదులిచ్చారు. ఇటీవల ఫ్లోరిడాలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్ భేటీ అయిన తర్వాత శాంతి ఒప్పందం ఎప్పటికంటే దగ్గరలో ఉందని ప్రకటించారు. ఇద్దరు అగ్రనేతల మధ్య జరగబోయే ఈ ఫోన్ కాల్ సంభాషణ యుద్ధ ముగింపులో కీలక పాత్ర పోషించనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## మొన్న డీకే, నిన్న శశి, ఇవాళ డిగ్గి

2 లో




## మా నాన్నను అంటే.. ఊరుకునేది లేదు

- కాళేశ్వరంలో రంధ్రాన్వేషణ చేస్తే రాష్టానికి నష్టం.. రాజకీయంగా తమకేమీ నష్టం రాదు
- పాలమూరు ప్రాజెక్టు కడితే కేసీఆర్‌కు పేరు వస్తుంది.. ఆయన బాస్ చంద్రబాబుకు కోపం వస్తుంది.. కేటీఆర్ హెచ్చరిక

**జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 29 :**

కాలంతో పోటీపడి మరీ కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని కేటీఆర్ తెలిపారు. కాళేశ్వరంలో రంధ్రాన్వేషణ చేస్తే రాష్ట్రానికి నష్టమని అన్నారు. రాజకీయంగా తమకేమీ నష్టం రాదని స్పష్టం చేశారు. నీళ్లు తీసుకొచ్చింది ఎవరో ప్రజలకు తెలుసనని అన్నారు. 45 టీఎంసీలకు ఒప్పుకుంటే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు నష్టం చేసినట్లే అని స్పష్టం చేశారు. 299 టీఎంసీలకు ఒప్పుకుంంది అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. దానిపైనే తమ ప్రభుత్వం మరిన్ని కేటాయింపు అడిగిందని తెలిపారు. పాలమూరు ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి కావాలనే పండబెట్టించడని మండిపడ్డారు.

## హరీష్ రావుకు అంత అహంకారం ఎందుకు?

- ప్రశ్నించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 29 :**

ఇరిగేషన్ లో తానే మాస్టర్ అని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అనుకుంటున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. హరీష్ రావు దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. హరీష్ రావు పై ఉత్తమ్ కుమార్ తీవ్ర విమర్శలు చేశారు.. హరీష్ రావుకు అంత అహంకారం ఎందుకు? అని.. ప్రశ్నించారు. ఎవరి హయాంలో ఏం జరిగిందో అన్ని పత్రాలు బయటపెడతామని, పాత జీవో కాపీలను మీడియాకు చూపెడతామని తెలియజేశారు. కృష్ణా జలాల్లో తాము 90టిఎంసిలు డిమాండ్ చేశామని, తాము 45 టిఎంసిలు అడిగామని దుష్ప్రచారం చేశారని విమర్శించారు. అబద్ధాల పునాదుల మీదే బిఆర్ఎస్ బతుకుతోందని, తెలంగాణకు అన్యాయం జరిగేలా తాను ఎందుకు లేఖ రాస్తానని ఉత్తమ్ ప్రశ్నించారు. సిడబ్ల్యూసికి రాసిన లేఖలో ఒక భాగాన్నే చూపిస్తున్నారని, కృష్ణా బేసిన్ పై అసెంబ్లీ ప్రజెంటేషన్ కు తాము సిద్ధమని సవాల్ విసిరారు. మేడిగడ్డ మరమ్మతులపై ఎల్అండ్ టికి నోటీసులిచ్చామని, మేడిగడ్డలో పలు పరీక్షలు, ఇతర తనిఖీలకు ఎల్అండ్ టి ఒప్పుకుందని పేర్కొన్నారు. త్వరలోనే మేడిగడ్డ పనులు మొదలవుతాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## కేబినెట్‌లో కొత్తగా 3 జిల్లాలకు ఓకే



**జయభేరి, విజయవాడ, డిసెంబర్ 29:**

సోమవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించి ఆమోదముద్ర వేశారు. దాదాపు 24 అంశాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, అనగాని సత్యప్రసాద్ మీడియాకు వెల్లడించారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో పాటు ఇప్పటికే ఉన్న జిల్లాల్లో పలు మార్పులు చేశారు. అలాగే డివిజన్లు, మండలాలను మార్చడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఏపీ కేబినెట్ తీసుకున్న కీలక నిర్ణయాలు ఏంటో తెలుసుకుందాం.ప్రకాశం జిల్లాలోని మార్కాపురంను జిల్లాగా ఏర్పాటు చేస్తామని గత ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ హామీ మేరకు మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటును కేబినెట్ ఆమోదించింది. మార్కాపురం, గిద్దలూరు, కనిగిర, యర్రగొండపాలెం కలిపి ఒక జిల్లాగా త్వరలో ఏర్పాటు చేయనున్నారు. ఇక అన్నమయ్య జిల్లా పేరును అలాగే ఉంచగా.. మదనపల్లెను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయనున్నారు. ఇక బనగానపల్లె, అడ్డరోడ్లను డివిజన్లుగా ఏర్పాటు చేయనుండగా. పెనుగొండను వాసవీ పెనుగొండగా మార్చాలని నిర్ణయించారు. అలాగే విశాఖలో ఆస్పత్రి నిర్మాణానికి భూమి కేటాయించారు. జనవరి 1 నుంచి ఈ మార్పులు అమల్లోకి తీసుకురానున్నట్లు ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది.

▶▶ మొదటిపేజీ తరువాయి

## అసెంబ్లీకి హాజరైన బీఆర్ఎస్ అధినేత

వ్యాఖ్యలు చేసిన వ్యక్తికి గౌరవం ఇవ్వాల్సిన అవసరం లేదని, రేవంత్ రెడ్డి చేసే నాటకాలకు కేటీఆర్ పడిపోరని వారు కౌంటర్ పోస్టులు పెడుతున్నారు. ఇలా కేసీఆర్, రేవంత్ ల స్నేహపూర్వక పలకరింపు ఎంత హాట్ టాపిక్గా మారిందో, కేటీఆర్ స్పందించని తీరు సైతం అంతే స్థాయిలో రాజకీయ చర్చకు దారితీసింది.

**సభ నుంచి ఎందుకు వెళ్లిపోయారో కేసీఆర్నే అడగండి: రేవంత్ రెడ్డి**

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రతిపక్ష నేత కేసీఆర్ను మర్యాదపూర్వకంగా పలకరించడంపై సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ లాబీలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. సభలోని ప్రతి సభ్యుడిని తాము గౌరవిస్తామని, అందులో భాగంగానే కేసీఆర్ను కలిసి పలకరించానని స్పష్టం చేశారు. కేసీఆర్ను తానేదో ఈరోజే కొత్తగా కలవలేదని, గతంలో ఆయన అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉన్నప్పుడు వెళ్లి పరామర్శించానని రేవంత్ గుర్తు చేశారు. సభ ప్రారంభమైన కొద్దిసేపటికే కేసీఆర్ అసెంబ్లీ నుండి వెళ్ళిపోవడంపై స్పందించారు. కేసీఆర్ సభ నుంచి అంత త్వరగా ఎందుకు వెళ్ళాల్సి వచ్చిందో ఆయన్నే అడగాలని మీడియా వారికి సూచించారు. ఇద్దరు నేతలు కలుసుకున్న సమయంలో ఏం మాట్లాడుకున్నారనే విషయంపై మీడియా ప్రతినిధులు ఆరా తీయగా, రేవంత్ రెడ్డి తనదైన శైలిలో సమాధానమిచ్చారు. తామిద్దరం వ్యక్తిగతంగా మాట్లాడుకున్న విషయాలను బయట అందరికీ ఎలా చెబుతామని సరదాగా వ్యాఖ్యానించారు. శాసనసభ వేదికగా ఇద్దరు అగ్ర నేతలు కరచాలనం చేసుకుంటూ, యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడం సభలోని వారితో పాటు రాష్ట్ర ప్రజలను ఆకట్టుకుంది. రాజకీయంగా ఎన్ని విభేదాలు ఉన్నా, సభా సంప్రదాయాలను పాటిస్తూ ఒకరినొకరు గౌరవించుకోవడం మంచి పరిణామమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**అసెంబ్లీకి హాజరైన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆయనకు ఘన స్వాగతం**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి చేరుకున్నారు. హైదరాబాద్ నందినగర్లోని తన నివాసం నుంచి బయల్దేరిన ఆయన అసెంబ్లీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆయనకు ఘన స్వాగతం పలికారు..కేసీఆర్ అసెంబ్లీకి చేరుకోవడంతో మంత్రివర్గంలో అలజడి మొదలైనట్టు తెలిసింది. ప్రజా ప్రభుత్వం పేరుతో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ సర్కార్ను సభలోనే గట్టిగా నిలదీయాలని కేసీఆర్ నిర్ణయించి, పార్టీ సభ్యులను సిద్ధంచేసిన నేపథ్యంలో ప్రభుత్వం ఆత్మరక్షణలో పడినట్టు కనిపిస్తున్నది.దక్షిణ తెలంగాణకు జీవనాడి అయిన పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు గురించి అసెంబ్లీలో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, అవసరమైతే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని ప్రధాన ప్రతిపక్షం డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో అధికార పక్షం అప్రమత్తమైనట్టు తెలిసింది. కేసీఆర్తో సబ్జెక్టు మాట్లాడటం కష్టమని, ఆ స్థాయిని తాము అందుకోలేమనే ఆందోళనతో అధికారపక్షం ఉన్నట్టు తెలిసింది. సాగునీటిపై షార్ట్ డిస్కషన్ను అనుమతించి సాధ్యమైనంత వరకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్కుమార్రెడ్డి వివరణతోనే నెట్టుకురావాలని నిర్ణయించినట్టు తెలిసింది. అసెంబ్లీ సమావేశాలను ఎక్కువ రోజులు సాగదీయకుండా రెండు, మూడు రోజుల్లోనే ముగించాలనే నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఇదిలా ఉండగా, అసెంబ్లీ చరిత్రలో మొదటిసారిగా జ్యుడీషియరీ క్యాడర్ నుంచి వచ్చిన అధికారి (ఆర్ తిరుపతి) అసెంబ్లీ కార్యదర్శి హోదాలో శాసనసభను నడిపించబోవడం విశేషం. ఇప్పటి వరకు అసెంబ్లీ క్యాడర్ అధికారులే ఈ బాధ్యత నిర్వర్తించేవారు.

**దివంగత నేత ఆర్.దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డిలకు సభ సంతాపం**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముందుగా సంతాప తీర్మానాలు ప్రవేశపెట్టారు. దివంగత నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డికి సభ సంతాపం ప్రకటించింది. మరోవైపు పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ మాజీ సర్పంచ్లు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసెంబ్లీ ముట్టడికి మాజీ సర్పంచ్లు ముట్టడిస్తారనే సమాచారంతో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. అలాగే అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. దాదాపు వెయ్యి మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

## మా నాన్నను అంటే.. ఊరుకునేది లేదు

పాలమూరు ప్రాజెక్టు కడితే కేసీఆర్కు పేరు వస్తుంది.. అప్పుడు ఆయన బాస్ చంద్రబాబుకు కోపం వస్తుందని అన్నారు. కృష్ణా నది నుంచి నీళ్లు తీసుకుంటే బాబుకు కోపం వస్తుందని అన్నారు. అందుకే ప్రాజెక్టును పండబెట్టి.. కాల్వలు కూడా తవ్వడం లేదని విమర్శించారు.రేవంత్ రెడ్డి అవినీతి అక్రమాలను ఆపినందుకే బూతులు మాట్లాడుతున్నాడని కేటీఆర్ తెలిపారు. నన్ను అంటే రెస్పాండ్ కాను.. కానీ మా నాన్నను అంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి బూతులకు నేను రెస్పాండ్ అవుతుంటే.. అతనిలా దిగజారవద్దని చెబుతున్నారని పేర్కొన్నారు. నీళ్లు గురించి అడిగితే నికృష్టపు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రెస్మీట్కే అల్లాడిపోతున్నారని.. అలాంటిది కేసీఆర్ను అసెంబ్లీకి రమ్మని డిమాండ్ చేస్తున్నారని వ్యాఖ్యానించారు. నీళ్ల సబ్జెక్టు చదివితే రాదని.. రాష్ట్రంపై ప్రేమ ఉంటే వస్తుందని చెప్పారు. పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్కు గొప్ప ఫలితాలు వచ్చాయని తెలిపారు.కృష్ణానది ఏ బేసిన్, ఎక్కడ ఉన్నదని ముఖ్యమంత్రి అడిగాడని కేటీఆర్ తెలిపారు. భాక్రనంగల్ ఏ రాష్ట్రంలో ఉన్నదో కూడా ఈ ముఖ్యమంత్రికి తెల్వదని ఎద్దేవా చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును అడ్డుకున్న వ్యక్తి ఇవాళ నీటిపారుదల శాఖ సలహాదారుడిగా ఉన్నాడని మండిపడ్డారు. వీళ్లు ఇప్పుడు అసెంబ్లీలో నీటిపారుదల శాఖపై చర్చ అంటున్నారని అన్నారు. నీటిపారుదల శాఖపై కనీస అవగాహన లేని వ్యక్తులు కేసీఆర్ చర్చకు రావాలని అంటున్నారని తెలిపారు. కేసీఆర్ వస్తున్నాడని ఇప్పుడు చర్చకు ప్రిపేర్ అవుతున్నారని విమర్శించారు.మేడిగడ్డను ఎవరో బాంబులు పెట్టి పేల్చారని పాడి కౌశిక్ రెడ్డి సభలో స్పష్టంగా చెప్పాడని కేటీఆర్ అన్నారు. బూతులు మాట్లాడాలంటే ఎన్నిరోజులైనా చర్చ పెడతారని.. సబ్జెక్ట్ లేనప్పుడు సభను ఎక్కువ రోజులు నడపలేరని తెలిపారు. చెక్డ్యాం పేల్చివేతలో రాఘవ కన్స్ట్రక్షన్ కంపెనీ ఉన్నదని అన్నారు. ఆనాడు మేడిగడ్డ పేల్చారని ఇంజినీర్లు ఫిర్యాదు చేస్తే ఎందుకు విచారణ చేపట్టలేదని ప్రశ్నించారు. రష్యా ఉద్యమంలో కాకువ డ్యామ్ను పేల్చేశారని.. అలాగే తెలంగాణలో మేడిగడ్డను పేల్చారని గతంలోనే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ క్లుప్తంగా వివరించి చెప్పారని అన్నారు. ఈ ప్రభుత్వం సభ సమయం పాటించడం లేదని కేటీఆర్ తెలిపారు. ఎన్నడూ లేనివిధంగా సభలో ఇవాళ మొదటి రోజే జీరో అవర్ పెట్టారని అన్నారు.

## వెండి ధరల పెరుగుదలపై ఎలాన్ మస్క్ ఆందోళన..

ఇండస్ట్రీలకు చాలా కీలకమైన వైట్ మెటల్ రికార్డు స్థాయిలో పెరగడంపై టెస్లా బాస్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.పారిశ్రామిక అవసరాలకు వెండి చాలా కీలకమైందని, అయితే ఈ స్థాయిలో ధరలు పెరగడం మంచిది కాదని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 'ఇది మంచిది కాదు. అనేక పారిశ్రామిక ప్రక్రియలకు వెండి అవసరం' అని ఆయన తన సోషల్ మీడియా ప్లాట్ఫామ్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో వెండి ధర ఔన్సుకు 79 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది.కాగా, వెండిని ఆభరణాలుగానే కాదు, అనేక పరిశ్రమల్లో పారిశ్రామిక ప్రక్రియల్లో ఉపయోగిస్తారు. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, సోలార్ పవర్ ప్యానెల్స్, డేటా సెంటర్లు, విద్యుత్ సంబంధిత పరికరాలు వంటి వాటిలో ఉపయోగిస్తారు. మస్క్కు ఎలక్ట్రానిక్ వాహన తయారీ సంస్థ ఉన్న విషయం తెలిసిందే. వెండి ధరల పెరగడంపై మస్క్ ఆందోళన వెనుక ఇదే ప్రధాన కారణంగా కనిపిస్తోంది.డిసెంబర్ నెలలో వెండి ధరలు అసాధారణంగా పెరిగాయి. ఈ పెరుగుదలకు ప్రధాన కారణంగా 2026లో ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో వీటి ధరలు దూసుకుపోతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. వెండితోపాటూ బంగారం ధరలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయి.

# మొన్న డీకే, నిన్న శశి, ఇవాళ డిగ్గీ





భారత జాతీయ కాంగ్రెస్ ప్రస్తుతం ఒక విచిత్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. బయటి శత్రువుల కంటే, పార్టీ అంతర్గత నేతల వైఖరే అధిష్టానానికి పెద్ద తలనొప్పిగా మారింది. రెస్సెస్, బీజేపీలపై ప్రశంసలు గుప్పించే కాంగ్రెస్ నేతలు రోజురోజుకూ పెరిగిపోతుండటం హస్తం పార్టీ హైకమాండ్కు కొత్త తలనొప్పిగా మారింది. కొన్ని రోజుల క్రితం ఆరెస్సెస్పై డీకే శివ కుమార్ ప్రశంసలు చేయగా.. గత కొంతకాలంగా శశిథరూర్ కూడా బీజేపీని పొగుడుతున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఆరెస్సెస్ను పొగుడుతూ దిగ్విజయ్ సింగ్ పెట్టిన పోస్ట్ పెను సంచలనంగా మారింది. దీంతో కాంగ్రెస్, బీజేపీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.కాంగ్రెస్ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ తాజాగా చేసిన వ్యాఖ్యలు ఈ వాదనకు బలం చేకూరుస్తున్నాయి. కరుడుగట్టిన ఆర్ఎస్ఎస్ వ్యతిరేకిగా ముద్రపడిన దిగ్విజయ్ సింగ్, హఠాత్తుగా ఆ సంస్థ పనితీరును ఉదాహరణగా చూపడం రాజకీయ వర్గాల్లోనే కాక, సొంత పార్టీలోనూ పెను దుమారం రేపుతోంది.

ఉపాధి హామీ పథకం పేరు మార్పు అంశంపై కేంద్రంపై పోరుకు సిద్ధమవుతూ, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం కానున్న తరుణంలో దిగ్విజయ్ సింగ్ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ పార్టీని ఇరకాటంలో నెట్టింది. "ఆర్ఎస్ఎస్లో నాయకుల పాదాల వద్ద కూర్చున్న ఓ సామాన్య కార్యకర్త.. రాష్ట్రానికి సీఎంగా, దేశానికి ప్రధానిగా ఎలా ఎదిగారో చూడండి. ఇది ఆర్ఎస్ఎస్, బీజేపీలకు ఉన్న సంస్థాగతమైన శక్తి" అంటూ ప్రధాని మోదీ ఫోటోను జత చేస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు పరోక్ష ప్రశంసల్లా ధ్వనించాయి. నిజానికి దిగ్విజయ్ ఉద్దేశం.. కాంగ్రెస్ పార్టీ కూడా సంస్థాగతంగా అంత బలంగా తయారు కావాలని చెప్పడమే కావచ్చు. ఆ తర్వాత ఆయన.. "నేను ఆర్ఎస్ఎస్, బీజేపీలకు బద్ధ వ్యతిరేకిని" అని వివరణ ఇచ్చినప్పటికీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను తీవ్రంగా వ్యతిరేకించాల్సిన సమయంలో, వారి సంస్థాగత నిర్మాణాన్ని కీర్తించడం ద్వారా కార్యకర్తల్లో గందరగోళం సృష్టించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.కాంగ్రెస్ పార్టీలో ఇలాంటి పరిణామాలు కొత్తేమీ కాదు. ఇటీవల కాలంలో పలువురు సీనియర్ నేతలు బీజేపీకి, ఆరెస్సెస్కు సానుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కేరళకు చెందిన సీనియర్ నేత శశిథరూర్ వ్యవహారశైలిపై పార్టీలో ఎప్పటినుంచో అసంతృప్తి ఉంది. ఆయన తరచుగా ప్రధాని మోదీని ప్రశంసించడం, లేదా బీజేపీ విధానాలపై మృదు వైఖరి అవలంబించడం చర్చనీయాంశమైంది.

తిరువనంతపురంలో బీజేపీ ఓటు బ్యాంకు పెరగడానికి, లేదా అక్కడ ఆ పార్టీ బలపడడానికి థరూర్ వైఖరే కారణమనే అనుమానాలు సొంత పార్టీ నేతల్లోనే ఉన్నాయి. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వంటి మాస్ లీడర్ ఏకంగా అసెంబ్లీ వేదికగా ఆర్ఎస్ఎస్ గీతాన్ని ఆలపించడం ఆ మధ్య పెద్ద వివాదానికే దారితీసింది. ఇది లౌకికవాద పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్ సిద్ధాంతాలకు పూర్తిగా విరుద్ధమనే విమర్శలు వచ్చాయి.కాంగ్రెస్ సీనియర్ నేతల ఈ ప్రవర్తన వెనుక అనేక కారణాలు కనిపిస్తున్నాయి.

దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న నేతలు, బీజేపీ క్షేత్రస్థాయి నెట్వర్క్ను చూసి, తమ పార్టీలోని సంస్థాగత లోపాలపై అసహనంతో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారా అనే కోణం ఉంది. దిగ్విజయ్ వ్యాఖ్యల్లో ప్రశంస కంటే, కాంగ్రెస్ నాయకత్వానికి మేల్కొనండి అని చెప్పే హెచ్చరిక కూడా ఉండవచ్చు. రాహుల్ గాంధీ ఒకవైపు ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతుంటే, సీనియర్ నేతలు మాత్రం దానికి భిన్నంగా వ్యవహరించడం.. పార్టీలో కమాండ్ అండ్ కంట్రోల్ లోపించిందన్న సంకేతాలను ఇస్తోంది. ఇప్పటికే అనేకమంది కాంగ్రెస్ నేతలు బీజేపీ గూటికి చేరారు. ఇప్పుడు పార్టీలో ఉంటూనే ఇలా వ్యాఖ్యలు చేస్తున్నవారు కూడా భవిష్యత్తులో గోడ దూకే అవకాశం ఉందన్న అనుమానాలు కేడర్ను వెంటాడుతున్నాయి.

దిగ్విజయ్ సింగ్ ఉద్దేశం ఏదైనప్పటికీ, టైమింగ్ మాత్రం పూర్తిగా బెడిసికొట్టింది. యుద్ధం జరుగుతున్నప్పుడు శత్రువు కత్తి పదునును పొగడడం సొంత సైన్యం మనోధైర్యాన్ని దెబ్బతీయడమే అవుతుంది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం జరుగుతున్న సమయంలోనే దిగ్విజయ్ సింగ్ చేసిన ఈ పోస్ట్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. 1990వ దశకంలో గుజరాత్ మాజీ సీఎం శంకర్సింగ్ వాఘేలా ప్రమాణ స్వీకార వేడుకలో తీసిన ఒక బ్లాక్ అండ్ వైట్ ఫోటోను తాజాగా దిగ్విజయ్ సింగ్ పెట్టిన పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. ఆ ఫోటోలో యువకుడిగా ఉన్న నరేంద్ర మోదీ , సీనియర్ నేత ఎల్కే అద్వానీ.. పాదాల దగ్గర కింద నేలపై కూర్చుని ఉన్నారు.ఈ ఫోటోను షేర్ చేసిన దిగ్విజయ్ సింగ్.. "ఈ ఫోటో చాలా ప్రభావవంతంగా ఉంది.

ఆర్ఎస్ఎస్ స్థాయి కార్యకర్త, జనసంఘ్, బీజేపీ వర్కర్ ఎలా ఎదిగారో ఇది చూపిస్తుంది. పార్టీ అగ్ర నాయకుల పాదాల దగ్గర నేలపై కూర్చున్న ఒక సామాన్య కార్యకర్త.. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా.. ఆ తర్వాత దేశ ప్రధానమంత్రిగా ఎదగడం అనేది ఆ సంస్థ శక్తికి నిదర్శనం. జై సియా రామ్" అని తన పోస్ట్ను ముగించారు.బీజేపీని సిద్ధాంతపరంగా ఎదుర్కోవాల్సిన సమయంలో, కాంగ్రెస్ సీనియర్లే ఆ పార్టీ సంస్థాగత బలాన్ని కీర్తించడం, పరోక్షంగా బీజేపీ నరేటివ్కే మేలు చేస్తోంది. ఈ అంతర్గత గందరగోళాన్ని చక్కదిద్దకపోతే, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ఇది మరింత పెద్ద రాజకీయ సవాలుగా మారే ప్రమాదం ఉంది

## ముగింపు దశలో రష్యాఉక్రెయిన్ యుద్ధం ?

నూతన సంవత్సరానికి ముందే శాంతి ఒప్పందం దిశగా కీలక అడుగులు పడుతున్నాయి. ఫ్లోరిడాలోని తన ఎస్టేట్లో జెలెన్స్కీతో జరిగిన సమావేశంలో ట్రంప్ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. శాంతి ప్రణాళిక 95 శాతం పూర్తయిందని జెలెన్స్కీ ప్రకటించారు. అయితే కీవ్లోని నివాస ప్రాంతాలపై రష్యా దాడులు కొనసాగుతున్నప్పటికీ, మాస్కో శాంతి పట్ల చిత్తశుద్ధితో ఉందని ట్రంప్ పేర్కొన్నారు. జెలెన్స్కీ రాకకు ముందే పుతిన్ కూడా ట్రంప్తో ఫోన్లో మాట్లాడారు. ఇరు పక్షాలు యుద్ధం ముగియాలని కోరుకుంటున్నాయని, గతంలో ఎన్నడూ లేనంతగా పరిష్కారానికి దగ్గరగా వచ్చామని ట్రంప్ వెల్లడించారు. ప్రాదేశిక వివాదాలు, సరిహద్దుల వంటి సున్నితమైన అంశాలపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే మరికొన్ని వారాల్లోనే దీనిపై పూర్తి అవగాహన వస్తుందని ట్రంప్ తెలిపారు. యుద్ధం కారణంగా వేలాది మంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో.. శాంతి స్థాపన కోసం జరుగుతున్న ప్రయత్నాలు ఊపందుకున్నాయి. ఒప్పందానికి సంబంధించిన పత్రాలను సిద్ధం చేసేందుకు రాబోయే రోజుల్లో యూరోపియన్, అమెరికన్ అధికారులతో సలహాదారుల స్థాయి సమావేశం ఏర్పాటు చేయాలని ఉక్రెయిన్ భావిస్తోంది. మరోవైపు ఉక్రెయిన్లో అమలవుతున్న మార్షల్ లా ఎత్తివేతపై జెలెన్స్కీ స్పష్టత ఇచ్చారు. యుద్ధం పూర్తిగా ముగిసి, పాశ్చాత్య దేశాల నుంచి తమకు భద్రతా హామీలు లభించిన తర్వాతే మార్షల్ లా తొలగిస్తామని సోమవారం ఆయన ప్రకటించారు. అప్పటి వరకు ఆంక్షలు కొనసాగుతాయని తేల్చిచెప్పారు.

## వైకుంఠ ఏకాదశి

ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తకుండా చూడాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అన్ని కీలక ప్రాంతాలను కమాండ్ & కంట్రోల్ రూమ్కు సీసీ కెమెరాల ద్వారా అనుసంధానం చేయడం జరిగిందని, ఈ సీసీ కెమెరాల పర్యవేక్షణతో పాటు సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ, ఏ చిన్న సమాచారం ఉన్నా వెంటనే కమాండ్ కంట్రోల్కు తెలియజేస్తూ విధులు నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు. అలాగే, పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో పని చేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శనం జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాల సందర్భంగా తిరుపతి జిల్లా పోలీస్ శాఖ అన్ని విభాగాల సమన్వయంతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టి, భక్తుల భద్రత, సౌకర్యాలు, శాంతిభద్రతల పరిరక్షణకు పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.




## "హైదరాబాద్ నగరాన్ని మనం వన్ క్లాస్ సిటీ అని గొప్పగా చెప్పుకుంటున్నాం. కానీ మనం మాట్లాడే మాటలు మాత్రం థర్డ్ క్లాస్కు పడిపోతున్నాయి"

**జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 29 :**
రాజకీయాల్లో విమర్శ ఉండాలి, కానీ విద్వేషం ఉండకూడదు. వాదన ఉండాలి, కానీ వేదన కలిగించే భాష ఉండకూడదు. దురదృష్టవశాత్తూ, గత కొన్నేళ్లుగా తెలంగాణ రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. "ఎవరు ఎంత గట్టిగా తిడితే, అంత గొప్ప నాయకుడు" అనే కొత్త, ప్రమాదకరమైన నిర్వచనం తెరపైకి వచ్చింది. సరిగ్గా ఇటువంటి సమయంలో, తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆత్మవిమర్శకు తెరలేపాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి నియోజకవర్గం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఒకవైపు అప్పటి సీఎం కేసీఆర్, మరోవైపు అప్పటి పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి.. ఇద్దరు హేమాహేమీలు బరిలో నిలిచారు. ఆ ఇద్దరినీ మట్టికరిపించి, 'జెయింట్ కిల్లర్'గా అసెంబ్లీలో అడుగు పెట్టారు వెంకటరమణారెడ్డి. ఆశ్చర్యకరంగా, ఇప్పుడు ఆ ఇద్దరు నేతలు పాటిస్తున్న లేదా ప్రోత్సహిస్తున్న దూషణల పర్వంపైనే ఆయన మొట్టమొదటి సారిగా గళం విప్పారు. సామాన్య ఎమ్మెల్యేగా కాకుండా, ప్రజల నాడిని పర్ఫెక్ట్గా పట్టుకున్న నాయకుడిగా ఆయన అసెంబ్లీ సాక్షిగా పీకిన క్లాస్ ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది. అసెంబ్లీలో వెంకటరమణారెడ్డి వాడిన పదాలు చాలా పదునుగా ఉన్నాయి. "హైదరాబాద్ నగరాన్ని మనం వన్ క్లాస్ సిటీ అని గొప్పగా చెప్పుకుంటున్నాం. కానీ మనం మాట్లాడే మాటలు మాత్రం థర్డ్ క్లాస్కు పడిపోతున్నాయి" అని ఆయన చేసిన వ్యాఖ్య సిగ్గుపడేలా చేసింది. అభివృద్ధిలో పోటీ పడాల్సిన నాయకులు, బూతుల్లో పోటీ పడుతుండటం వల్ల సమాజంలో రాజకీయ నాయకులపై గౌరవం తగ్గిపోతోందన్న ఆయన ఆవేదనలో వంద శాతం నిజముంది. ముఖ్యంగా, "ఒకరు మనల్ని తిట్టినప్పుడు, మనం అంతకంటే రెండు మాటలు ఎక్కువ తిడితే జనం మెచ్చుకుంటారని అనుకోవడం మూర్ఖత్వం" అని ఆయన తేల్చి చెప్పారు. ఇది కేవలం అధికార పక్షానికో, ప్రతిపక్షానికో పరిమితం కాదు.. అందరికీ వర్తించే సార్వజనీన సత్యం.రాజకీయ నాయకులు తమను తాము గౌరవించుకోనప్పుడు, ఇతరులు తమను ఎందుకు గౌరవిస్తారు? అనే ప్రాథమిక ప్రశ్నను ఆయన లేవనెత్తారు. ప్రధానమంత్రి మోదీ, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ వంటి వారిని మీడియా ప్రతినిధులు ఏకవచనంతో సంబోధించడాన్ని ఆయన తప్పుబట్టారు. అయితే, దానికి కారణం మీడియా కాదని, రాజకీయ నాయకులు ఒకరినొకరు పిలుచుకుంటున్న విధానమేనని ఆయన విశ్లేషించడం గమనార్హం. "మనమే బూతులు తిట్టుకుంటూ, మీడియా వాళ్లు మనల్ని క్లాస్మేట్స్ లాగా ట్రీట్ చేస్తున్నారు" అనడం ద్వారా.. వ్యవస్థలో లోపం ఎక్కడుందో ఆయన వేలు పెట్టి చూపించారుఈసారి తెలంగాణ అసెంబ్లీకి దాదాపు 57 మంది కొత్త ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. వీరంతా సీనియర్లను చూసి నేర్చుకోవాలి. కానీ, సభలో సీనియర్లు ప్రదర్శిస్తున్న ప్రవర్తన, వాడుతున్న భాష కొత్తవారిని తప్పుదోవ పట్టించేలా ఉందని వెంకటరమణారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సభలో హుందాతనం, సంప్రదాయాలు, పరస్పర గౌరవం ఉండాలని.. ఒకరు మూర్ఖంగా మాట్లాడితే, మరొకరు సద్విమర్శతో సరిచేయాలే తప్ప, అంతకంటే దిగజారిపోకూడదని ఆయన హితవు పలికారు.సభలో వెంకటరమణారెడ్డి లేవనెత్తిన ఆవేదనతో మంత్రి శ్రీధర్ బాబు ఏకీభవించడం స్వాగతించదగ్గ పరిణామం. అయితే, ఇది కేవలం మాటలకే పరిమితం కాకూడదు. తిట్టడమే రాజకీయం అనే భావన నుంచి ప్రశ్నించడమే రాజకీయం అనే స్థాయికి మన ప్రజాస్వామ్యం ఎదగాలి. కామారెడ్డి ప్రజలు ఇద్దరు ముఖ్యమంత్రులను ఓడించి వెంకటరమణారెడ్డిని గెలిపించింది బహుశా.. ఇలాంటి నిష్ఠూర సత్యాలు చెప్పడానికేనేమో! ఆయన మాటలు ఎంతమంది చెవికెక్కుతాయో కాలమే నిర్ణయించాలి. కానీ, రాజకీయాల్లో పడిపోతున్న విలువలను కాపాడటానికి ఒక ప్రయత్నం మాత్రం జరిగింది.

# వైకుంఠ ఏకాదశికి ముస్తాబైన యాదాద్రి

- ఉదయం 5.30కు స్వామి, అమ్మవార్ల ఉత్తర ద్వార దర్శనం
- భారీగా తరలిరానున్న భక్తులు.. ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికారులు
- రంగురంగుల విద్యుత్ దీపాలతో అలరిస్తున్న ఆలయం

**జయభేరి, యాదగిరిగుట్ట, డిసెంబర్ 29:**



తెలంగాణ ప్రసిద్ధి క్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయం వైకుంఠ ఏకాదశి కి ముస్తాబైంది. భక్తులు ఎంతో పుణ్యంగా భాగంగా వైకుంఠ ఏకాదశిని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మంగళవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉదయం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు మధ్య ఉత్తర ద్వారం గుండా శ్రీలక్ష్మీనరసింహస్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. తెల్లవారు జామున 2 గంటలకు ఆలయాన్ని తెరిచి సుప్రభాత సేవ,ప్రాతఃకాలతిరువారాధన, తదితర పూజా కైంకర్యాల అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి గరుడ వాహనంపై అధిష్టింపజేసి ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిస్తారు. అనంతరం స్వామివారికి ఆలయ పురవీధుల్లో ఊరేగిస్తూ వైకుంఠ ఏకాదశి విశిష్టతను అర్చకులు భక్తులకు వివరిస్తారు. ఏకాదశి సందర్భంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దర్శనానికి రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భారీ ఏర్పాట్లు చేశారు. రంగు రంగుల విద్యుత్ దీపాలు,వివిధ రకాల పుష్పాలతో ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. కాగా వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారి దర్శనానికి రావాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డివెంకట్ రెడ్డి, రాష్ట్రదేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు పలువురు మంత్రులు,ఇతర ప్రముఖులను ఆలయ అధికారులు ఆహ్వానించారు.



**వాహనాలను అనుమతి నిరాకరణ..**

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని శ్రీలక్ష్మీనరసింహస్వామి వారు గరుడవాహనంపై ఊరేగనున్నారు. గరుడవాహన సేవ సందర్భంగా ఆలయంలో తెల్లవారుజాము 3.30 నుంచి గరుడసేవ పూర్తయ్యే వరకు స్థానికులు,భక్తుల వాహనాలు కొండపైకి అనుమతి లేదని, కొండ కింద స్వామి వారి పాదాల దగ్గర నుంచి ఉచిత ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంచినట్లు ఆలయ అధికారులు తెలిపారు.


**కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు...**

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని యాదగిరిగుట్ట ఆలయంలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. సోమవారం భద్రతా ఏర్పాట్లను డీసీపీ ఆకాంక్ష యాదవ్, ఏసీపీ శ్రీనివాస్ నాయుడు పరిశీలించారు. ఆలయంలో క్యూలైన్లలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైకుంఠ ఏకాదశికి స్వామి, అమ్మవార్ల దర్శనార్థం భక్తులు భారీగా తరలివస్తారని,భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు,భద్రతా చర్యల్లో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూడాలని ఆయన ఆదేశించారు. భక్తుల వస్తుసామాగ్రి తనిఖీ చేసే కొత్త బ్యాగేజీ స్కానర్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

# యాదగిరిగుట్ట మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వండి

- సీపీఐ ధర్నాలో రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు డిమాండ్

**జయభేరి, యాదగిరిగుట్ట:**




భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు నాలుగు గంటల పాటు ధర్నాను నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని అతి పెద్ద పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం రాష్ట్ర నలుమూలల నుండి కాకుండా ఇతర రాష్ట్రాల నుండి నిత్యం వేల సంఖ్యలో ప్రజలు వస్తూ వెళ్తున్న పర్యాటక కేంద్రం. ఈ ప్రాంతంలో సరైన డ్రైనేజీ, సీసీ రోడ్డు లేక ఇండ్ల మధ్యన మురికి కుంటల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎక్కడ చూసినా సమస్యలు చెత్తకుప్పల పేరుకపోయాయని వీటి పరిష్కారానికి,మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ శరణ్యం అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందుకోసం ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరారు. అనేక సంవత్సరాలుగా అద్దె ఇంట్లో కిరాయికుంటూ సొంత ఇల్లు లేక వందలాది మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఇందిరమ్మ ఇండ్లను నిర్మాణం చేసి పేద ప్రజలకు అందించాలన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలోని చాలా సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన కరెంటు స్తంభాలు,వైర్లు కిందకి సాగి వేలాడుతు, ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉందని తక్షణమే ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. సరైన డ్రైనేజీ అవుట్ లైన్ లేక ఇండ్ల మధ్యన మురికి చేరి కాలువలను తలపిస్తున్నాయని, ఖాళీ ప్రదేశాలలో పెద్ద కుప్పలుగా పేరుకు పోయాయని అన్నారు. అధికారుల నిర్లక్ష్యం వలన ఇష్టానుసారంగా సిసి రోడ్లు పగలగొట్టడం,రోడ్లపైన అక్రమంగా నిర్మాణాలు చేశారని చాలా వీధులలో రాకపోకలు ఆటంకం కలుగుతూ ప్రజల ఇబ్బందులు పడుతున్నారు. ఇండోర్ అవుట్ డోర్ గ్రౌండ్ ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందన్నారు. పునర్నిర్మాణంలో భాగంగా కోల్పోయిన వారికి నష్టపరిహారంగా ఇస్తున్న ప్లాట్లు ఇంకా ఇవ్వలేదని వారికి ప్లాట్లను తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అమృత్ పథకం కింద యాదగిరిగుట్ట పట్టణంలో అవసరం లేకున్నా సిసి రోడ్లను పగలగొట్టి పైపులు వేశారని, కొన్నిచోట్ల పైపులైన్లు వేస్తామని రోడ్డు పగలగొట్టి ఆరు నెలలైనా పైపులైన్లు వేయలేదని సీసీరోడ్డు పగలగొట్టిన ప్రదేశంలో తక్షణ ప్యాచ్ వర్క్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ నెల 26 నుండి 28 వరకు మూడు రోజుల పాటు యాదగిరిగుట్ట పట్టణంలోని 12 వార్డులు పాదయాత్ర ద్వారా తిరిగి ప్రజల నేరుగా కలిసి సమస్యలను తెలుసుకోవడం జరిగింది. ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని వాటన్నిటిని పరి ష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం సుమారు 180 సమస్యలతో కూడుకున్నటువంటి వినతి పత్రాన్ని యాదగిరిగుట్ట మున్సిపల్ కమిషనర్ లింగస్వామికి అందజేశారు. యాదగిరిగుట్ట మున్సిపల్ కమిషనర్ లింగస్వామి మాట్లాడుతూ సిపిఐ ఇచ్చిన వినతి పత్రంలోని సమస్యలు అన్నింటిని 12 వార్డులు తిరుగుతూ సమస్యలను గుర్తించి పరిష్కారం కృషి చేస్తానని ఉన్నత అధికారులు దృష్టి కూడా తీసుకువెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, పేరబోయిన మహేందర్, మున్సిపల్ శాఖ కార్యదర్శి బబ్బురి శ్రీధర్, మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, మున్సిపల్ సహాయ కార్యదర్శి పేరబోయిన బంగారి, కార్యవర్గ సభ్యులు ఆరె పుష్ప, గోపగాని రాజు, రాయగిరి బాలకిషన్,మునుకుంట్ల నరసమ్మ,గుండు వెంకటేష్, ముక్కెర్ల పెంటయ్య పాకలపాటి రాజు,మద్దూరు భాగ్యమ్మ,అనంతుల నరసింహ, పబ్బాల స్వామి, కంబాల యాదగిరి, సత్తి బాబు, ఇస్తారీ ,పొన్నాల రాములు, కంబాల వెంకటేష్, కళ్లెం సిద్ధులు పాల్గొన్నారు.

# గెలుపొందిన సర్పంచులకు అభినందనలు

- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు అయింది కానీ ఇప్పటికీ ఏ ఒక్క హామీ నెరవేరలేదు
- రెండేళ్లలో కచ్చితంగా మళ్ళీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. మళ్ళీ కేసీఆర్ గారే ముఖ్యమంత్రి అవుతారు.
- గెలిచిన సర్పంచులంతా ధైర్యంగా ఉండండి.

**జయభేరి, పీ ఏ పల్లి :**



కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు అయింది కానీ ఇప్పటికీ ఏ ఒక్క హామీ నెరవేరలేదు అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. సోమవారం దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పిఏ పల్లి మండలం వద్దిపట్ల, దుగ్యల గ్రామాల సర్పంచులుగా విజయం సాధించిన రాయినబోయిన శ్రీను నీ, నగేష్ ని అభినందించి, శాలువాల, మెమోటోతో సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలు అపరిశుభ్రంగా మారాయి. కనీసం కేసీఆర్ కొనిచ్చిన ట్రాక్టర్లలో డీజిల్ పోసే పరిస్థితి కూడా ఈ ప్రభుత్వానికి లేదు అని ఆయన అన్నారు. ఆనాడు కేసీఆర్ ప్రతి నెలా పల్లెలకు నిధులు విడుదల చేసేవారు. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక రాష్ట్ర ప్రభుత్వ నిధులు, కేంద్ర ప్రభుత్వ నిధులు బంద్ అయ్యాయి ఆయన తెలిపారు.పల్లె ప్రకృతి వనాలు, డంపు యార్డు్లు అన్నీ మూలకు పడ్డాయి అని ఆయన గుర్తు చేశారు.గ్రామాలలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది అని ఆయన అన్నారు. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారు కాబట్టే.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పారు అని ఆయన తెలిపారు.రెండేళ్లలో కచ్చితంగా మళ్ళీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. మళ్ళీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారు అని ఆయన తెలిపారు.గెలిచిన సర్పంచులంతా ధైర్యంగా ఉండండి అని ఆయన తెలిపారు.మళ్ళీ గ్రామాలకు మంచి రోజులు వస్తాయి,అభివృద్ధి పథంలో మన గ్రామాలన్నీ ప్రయాణిస్తాయి అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



# ఆధార్ సెంటర్ ను ప్రారంభించిన స్థానిక సర్పంచ్

**జయభేరి, గుడిపల్లి :**

గుడిపల్లి మండల కేంద్రంలో స్థానిక ZPHS ఉన్నత పాఠశాలలో ఆధార్ సెంటర్ ప్రారంబానికి ముఖ్య అతితులుగా స్థానిక సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి విచ్చేసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆధార్ తప్పులను సరిచేసుకోవాలి ఎక్కడో పోయి ఇబంధులు పడకుండా మన దగ్గర ఈ ఆధార్ సెంటర్ నీ ప్రారంభించడం చాలా సంతోషకరం అనీ ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల MEO సముద్రాల శ్రీనయ్య, MPO నవీన్, ఉప సర్పంచ్ ఆర్వేపల్లి శ్రీనయ్య వార్డు సభ్యులు యర్ర వంశీ కత్తుల రమేష్ యర్ర రామలింగం బోడ నాగరాజు వడ్లపల్లి శ్రీనివాస్, పోచంరెడ్డి వెంకట్ రెడ్డి యర్ర అరుణ్ కుమార్ యర్ర సైదులు జగదీష్ మరియు ZPHS అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# ఏబీవీపీ మహాసభలను విజయవంతం చేద్దాం




**జయభేరి, దేవరకొండ :**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో 44వ రాష్ట్ర మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ దేవరకొండ నగర కార్యదర్శి పగిళ్ల విక్రమ్ మాట్లాడుతూ నిరంతర ఉద్యమాలతో విద్యార్థుల సమస్యలపై గళమెత్తుతున్న ఏకైక విద్యార్థి సంఘం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అని అన్నారు.జనవరి 3,4,5 తేదీలలో శంషాబాద్ లో రాష్ట్ర మహాసభలను నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ మహాసభల్లో దాదాపు 800మంది విద్యార్థి నాయకులు, ప్రొఫెసర్లు, ప్రముఖులు, రాష్ట్ర నలుమూలల నుంచి విద్యార్థి నాయకులు హాజరవుతారని తెలిపారు. విద్యారంగ సమస్యలపైన, విద్యారంగస్థితి, రాష్ట్ర సమస్యలు, పర్యావరణ పరిరక్షణ, డ్రగ్స్ మహమ్మారి నిర్మూలన తదితర అంశాలపై తీర్మాణాలు చేయనున్నట్లు ప్రకటించారు. జిల్లాలోని విద్యార్థి నాయకులు మహాసభలకు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నల్గొండ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ యలమల గోపీచంద్, నగర సంయుక్త కార్యదర్శి యలమల హేమ సుందర్, శంకర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



# అయ్యప్ప స్వామీ మహా పడిపూజ కార్యక్రమం

- బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి రమాదేవి దంపతులు

**జయభేరి, షాద్ నగర్, డిసెంబర్ 29 :**

ముచ్చింతల్ గ్రామంలో నిర్వహించిన అయ్యప్ప స్వామీ మహా పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి రామాదేవి దంపతులు. ప్రత్ గిరీష్ నాయర్ గురు విష్ణువర్ధన్ రెడ్డి దంపతులను ఆశీర్వదించారు. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. అయ్యప్ప మాల ధరించడం అంటే నియమాలు పాటించడం, మానసిక శక్తిని పెంచుకోవడం అని అన్నారు. అయ్యప్ప స్వామీ ఆశీస్సులతో ఈ ప్రాంత ప్రజలందరు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు.ఈ కార్యక్రమంలో అనిల్ స్వామీ మరియు అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొనడం జరిగింది.

# తై బజార్ వసూళ్లు నిలిపివేయాలని ప్రజావాణిలో వినతి



**జయభేరి, మేడ్చల్ :**

గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలో తై బజార్ వసూళ్లను డిసెంబర్ 31 తో నిలిపివేయాలని కోరుతూ గుండ్లపోచంపల్లి మాజీ కౌన్సిలర్ అమరం జైపాల్ రెడ్డి సోమవారం ప్రజావాణిలో మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సూదంష్ కు వినతి పత్రాన్ని అందజేశారు. గత మార్చి లో మున్సిపాలిటీ వేలంపాట లో రూ.21 లక్షల 54వేలకు నిర్వహకులు తై బజార్ ను దక్కించుకున్నారు. ప్రస్తుతం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ జీహెచ్ఎంసీ లో విలీనం చేసి 299 డివిజన్ గా మార్చడం జరిగింది. కావున 31 డిసెంబర్ 2025 నాటితో తై బజార్ వసూలు నిలిపివేయలని జైపాల్ రెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు.

# సీఎం సహాయనిధి పేదలకు వరం

- సాయిపేట శ్రీనివాస్



**జయభేరి, మేడ్చల్ :**

నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం వరం లాంటిదని గుండ్లపోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మేడ్చల్ సర్కిల్ గుండ్లపోచంపల్లి డివిజన్ కు చెందిన చాకలి నర్సింహా అనారోగ్యంతో మరణించగా అతని సీఎం ఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ. 60 వేల చెక్కును అతని కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా సాయిపేట శ్రీనివాస్ మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు తక్షణ సాయంగా సీఎం సహాయనిది పథకం ఎంతో సహాయ పడుతుందని ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీఎం సహాయ నిది నుండి సహాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్ లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండారి నరేందర్, మాజీ సర్పంచ్ బేరి ఈశ్వర్, సేవాదళ్ మాజీ చైర్మన్ కిషన్, మైనారిటీ మాజీ అధ్యక్షులు షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

# నట్టల నివారణ మందులను గొర్ల కాపర్లు సద్వినియోగం చేసుకోవాలి



**జయభేరి, తుర్కపల్లి, డిసెంబర్ 29 :**

నట్టల నివారణ మందులను గొర్ల కాపర్లు చేసుకోవాలని సర్పంచ్ కర్రె మాధవి కరుణాకర్ గౌడ్ అన్నారు. సోమవారం తుర్కపల్లి మండలం వెంకటాపూర్ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలకు, మేకలకు ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ అవకాశాన్ని గొర్ల ,మేకల కాపరులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది శేఖర్, రైతులు గుంటి ఐలయ్య, కొడపాక రాములు తదితరులు పాల్గొన్నారు.



# బీసీ కాలనీ వద్ద బస్ స్టాప్ ఏర్పాటు చేయాలి

జయభేరి, తుర్కపల్లి, డిసెంబర్ 29 :

తుర్కపల్లి మండలం తిరుమలపురం గ్రామంలోని బీసీ కాలనీ వద్ద బస్టాప్ ను ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు సోమవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుమలాపురం గ్రామంలోని బీసీ కాలనీ వద్ద బస్ స్టాప్ లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే బస్టాప్ ను ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డొంకెన రేణుక వెంకటేష్ యాదవ్, వార్డు సభ్యులు చాడ కరుణాకర్ రెడ్డి, తిగుళ్ల చైతన్య బాలకృష్ణ, మాజీ ఉప సర్పంచ్ సముద్రాల వెంకటేష్ పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించిన సర్పంచ్



జయభేరి, తుర్కపల్లి, డిసెంబర్ 29 :

తుర్కపల్లి మండల కేంద్రంలో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించినట్లు సర్పంచ్ సోమల వెంకటేశం అన్నారు సోమవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ మొట్టమొదటి జనరల్ బాడీ సమావేశాన్ని గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి తీర్మానాలను చేశారు యాదగిరిగుట్ట రోడ్డు నుండి రామాలయం వరకు సిసి రోడ్డు నిర్మాణం, స్వర్ణపురి వాహనం ఏర్పాటు పలు వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, గ్రామపంచాయతీ వాటర్ ఫిల్టర్ రిపేర్, దుర్గమ్మ తల్లి ఆలయం నుంచి బోనాలమడుగు డ్రైనేజీ లైన్ నిర్మాణం ఏర్పాటు, రాముల గుట్ట రామాలయం నుంచి 100 మీటర్ల వరకు సిసి రోడ్డు నిర్మాణ పనులకు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పల్లె నరేష్ గౌడ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి శైలజ, కారోబార్ యాదిరెడ్డి పాల్గొన్నారు.

# పిహెచ్ సి ఉప కేంద్రాన్ని సందర్శించిన డిప్యూటీ డిఎంహెచ్ ఓ



జయభేరి, తుర్కపల్లి, డిసెంబర్ 29 :

తుర్కపల్లి మండలం పల్లెపహాడ్ గ్రామంలోని పీహెచ్సీ ఉప కేంద్రమును సోమవారం డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ వంశీకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. అనతి కాలంలోనే జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వంశీకృష్ణ కొంతకాలం పాటు ప్రోగ్రాం ఆఫీసర్గా బాధ్యతలు నిర్వహించి ప్రస్తుతం జిల్లాలోని డిప్యూటీ డిఎంహెచ్వో గా ప్రమోషన్ పొందిన వెంటనే పల్లెపహాడ్ ఉప కేంద్రాన్ని సందర్శించడంతో ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాహుల్ కుమార్ గౌడ్ ,సిహెచ్ఓ రాజయ్య, ఏఎన్ఎం కరీంబి పాల్గొన్నారు.

# విశాఖ సభను జయప్రదం చెయ్యండంటూ సిఐటీయు ర్యాలీ

- సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి పిలుపు




జయభేరి, పరవాడ:

పరవాడ. సిఐటియు అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని జనవరి 4న విశాఖపట్నంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలం కేంద్రమైన పరవాడ మండల పరిషత్ కార్యాలయం నుండి సబ్ స్టేషన్ వరకు జనవరి 4 చలో విశాఖ జయప్రదం చేయాలని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గని శెట్టి మాట్లాడుతూ.. సిఐటియు 18వ అఖిలభారత మహాసభలు జయప్రదం చేయండి. డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు సిఐటియు అఖిలభారత మహాసభలు విశాఖ పట్నం వేదిక కానున్నాయని సిఐటియు ఆవిర్భవించి 55 సంవత్సరాల కాలంలో మొదటిసారి ఆంధ్రప్రదేశ్లో విశాఖపట్నం మహాసభలకు వేదిక కానున్నదని. ఈ మహాసభలకు 2000 మంది ప్రతినిధులు అన్ని రాష్ట్రాల నుండి, కేంద్రపాలిత ప్రాంతాల నుండి హాజరవుతారని. ఈ మహాసభల్లో కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా చర్చించి భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం అవుతారని. కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని, బయటికి మేడిపండులా ఉన్న ఈ చట్టం లోపల కార్పొరేట్ కంపెనీలకి అనుకూలమైన విధానాల్ని అమలు చేస్తున్నారని. ఇప్పటివరకు ఉన్న హక్కుల్ని కాలరాస్తున్నారని. ఈనేపథ్యంలో జరుగు మహాసభల్లో ముగింపుగా జనవరి 4న భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారని, ఈ మహాసభలు జయప్రదానికి కార్మికులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని గని శెట్టి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కే రమణి, ఎస్ శంకరమ్మ, దేవి, అనిత, అమ్మాజీ, నీలిమ, వరలక్ష్మి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో ప్రతి పల్లెలో వెలుగు నింపుతాం

- రాసుమల్ల గూడా గ్రామ సర్పంచ్ నత్తి శివరాములు
- నాగులపల్లి రాసుమల్లగూడ రహదారిని త్వరలో ప్రారంభిస్తాం
- నూతనంగా గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాసుమల్లగూడ గ్రామ సర్పంచ్ నత్తి శివ రాములు
- రాసుమల్లగూడ సర్పంచ్ శివరాములును ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు..



జయభేరి, షాద్ నగర్, డిసెంబర్ 29 :

ప్రజాపాలనలో ప్రతి పల్లెను వెలుగుతో నింపుతామని రాసుమల్లగూడ గ్రామ సర్పంచ్ నత్తి శివరాములు అన్నారు. పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచి గెలుపొందిన నూతనంగా నాయకుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సర్పంచ్ శివరాములు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు సర్పంచ్ శివరాములును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శివరాములు మాట్లాడుతూ; రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలంలో గతంలో ఉమ్మడిగా ఉన్న గ్రామ పంచాయతీలైన నాగులపల్లి రాసుమల్లగూడ రహదారులు పూర్తిస్థాయిలో అన్నిరంగాల్లో అభివృద్ధి చెందే దిశగా కాంగ్రెస్ పార్టీ తరపున రెండు గ్రామాలను అన్నదమ్ముల వలె చూసి అభివృద్ధి లక్ష్యంగా పనిచేసి గ్రామానికి కావలసిన అన్ని నిధులను అధికార పార్టీ అయినా కాంగ్రెస్ తరపున తమ సహాయ సహకారాలు అన్ని విధాల అందించడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. కదం కథం అందరితో కలిసి మెలిసి రెండు గ్రామాల రహదారుల అభివృద్ధికి అన్ని రకాల నిధులకు తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఆయన అన్నారు. కొద్ది మెజార్టీతో నాగులపల్లి పాండు గౌడ్ అపజయం అందరి కలిసి ఉంటే గెలుపు మనదే ఉండేది... ఇద్దరు వ్యక్తులు పోటీ చేయడం వల్ల కాంగ్రెస్ పార్టీ అపజయం పొందడం పట్ల పెద్ద ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాసుమల్ల గూడా సర్పంచ్ శివరాములు అన్నారు. నాగులపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా గడిగెల రజిత పాండు గౌడ్ గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలుపుతూ.. గెలిచినా ఓడినా పాండు మీ వెంటే ఉన్నాడని ఇప్పటికైనా ప్రతి ఒక్కరు కలిసిమెలిసి ఉండి వచ్చే ఏ రాజకీయ అవకాశాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ తరపున వదులుకోకూడదని ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పాలనలో సమాన అవకాశాలు లభిస్తాయని అందరూ కలసి మెలసి కదం కదం కలిపి ముందుకు సాగాలని అన్నారు. కాంగ్రెస్ ని ఆదరించి ఓటు వేసిన ప్రతి ఒక్కరికి ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిజెపి పార్టీ నాగులపల్లి గ్రామ ఉప సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రాములు గౌడ్, ఆవుల రవి, నరసింహారెడ్డి, నరసింహ చారి, డాక్టర్ ఆంజనేయులు, యాదయ్య, సుదర్శన్ రెడ్డి, తూర్పాటి వెంకటేష్, బీరయ్య, యువ నాయకులు... రాఘవేందర్ రెడ్డి, అనిల్, సతీష్, రాజు, సంతు, అంజి, రాజశేఖర్, శ్రీకాంత్, మహేష్, సంపత్ కుమార్, యాదగిరి, కుమార్, రాము, మహేష్, హనుమంతు, రమేష్, శ్రీను, రాఘవేందర్, శివ పాల్గొన్నారు.





# మరో యువకుడి గొంతు కోసిన వైర్ మాంజా

జయభేరి, హైదరాబాద్ :

చైనా మాంజా నిషేధం పని చేయడంలేదు. మార్కెట్ లో యాధేచ్ఛగా దొరుకుతోంది. మొన్ననే కీసరలో ఓ యువకుడి గొంతు కోసిన వైర్ మాంజా నేడు మరో యువకుడిని తీవ్ర గాయాలు పాలు చేసింది. నవాబ్ సాహెబ్ కుంటకు చెందిన జమీల్ బైక్ పై చార్మినార్ వైపు వెళ్తున్నాడు. శంషీర్ గంజ్లో చైనా మాంజా అతని గొంతుకు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉంది.

# ఎక్సైజ్ అధికారులు వేధిస్తున్నారు

- వైన్ షాపు యజమాని ఆందోళన

జయభేరి, నల్లగొండ:

అనుముల మండలం హాలియాలో.. ఎక్సైజ్ పోలీసులు ఓవరాక్షన్ చేసారు. తిరుమలగిరి సాగర్ వైన్స్ లపై అక్రమ కేసులు నమోదు చేయడం, ముడుపులు ముట్టనందుకేనని యాజమాని ఆరోపించాడు. పురుగుల మందు డబ్బాతో ఎక్సైజ్ ఆఫీస్ ముందు వైన్ షాప్ ఓనర్ విద్యాసాగర్ రెడ్డి బైటాయించాడు. ఎక్సైస్ సీఐ కల్పన తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ, ఎక్సైజ్ ఆఫీస్ ముందు ఆందోళనకు దిగాడు.

# బయలుదేరిన ఎర్నాకుళం ఎక్స్ ప్రెస్

జయభేరి, అనకాపల్లి:

ప్రమాదానికి గురైన రెండు బోగీలను వేరు చేసిన తర్వాత, టాటా నగర్ ఎర్నాకుళం ఎక్స్ప్రెస్ ప్రయాణికుల తో బయలుదేరినట్లు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలి పారు, సోమవారం ఉదయం ఘటనా స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ప్రయాణికు లతో మాట్లాడారు. బ్రేక్ వేయడంతో కలిగిన ఒత్తిడి కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నట్లు, 2 బోగీల్లో 143 మంది ప్రయాణికు లు ఉన్నారని పేర్కొన్నారు.

# కొండగట్టు దేవాలయంలో జనవరి 3న 35 కోట్లతో 96 గదుల నిర్మానానికి శంకుస్థాపన

జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 29:

కొండగట్టు దేవాలయంలో జనవరి 3న 35 కోట్లతో 96 గదుల నిర్మానానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శంకుస్థాపన చేస్తున్నట్లు టీటీడీ హిమాయత్ నగర్ లోకల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ నేమూరి శంకర్ గౌడ్ తెలిపారు.కొండగట్టు దేవాలయంలో టీటీడీ సహకారంతో భక్తుల సౌకర్యార్థం 35 కోట్లతో 96 గదుల నిర్మాణం, కళ్యాణ మండపాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు.ఈ శంఖు స్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాల్గొని శంకుస్థాపన చేయనున్నట్లు శంకర్ గౌడ్ వెల్లడించారు.

# కాంగ్రెస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా..

- రాజకీయంలో గెలుపోటములు సహజం
- కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గడిగెల పాండు గౌడ్
- గెలుపొందిన నూతన నాయకులు కలిసి కట్టుగా గ్రామ అభివృద్ధికి కృషి చేయాలి
- నూతనంగా గెలుపొందిన నాయకులను సన్మానించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు
- ముఖ్య అతిథిగా పాల్గొన్న రాసుమల్లగూడ గ్రామ సర్పంచ్ నత్తి శివరాములు నాగులపల్లి గ్రామ ఉప సర్పంచ్ సుమన్ గౌడ్
- పత్రికా విలేకరులను ఆహ్వానించి ఘనంగా సన్మానం




జయభేరి, షాద్ నగర్, డిసెంబర్ 29 :


పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా పోటీచేసి అపజయం పొందిన ఏ కార్యకర్త కూడా ఆందోళన చెందవద్దు అని పోటీ చేసిన నాగులపల్లి అభ్యర్థి గడిగెల రజిత పాండు గౌడ్ అన్నారు. నా కోసం పని చేసిన ప్రతి ఒక్కరిని కంటికి రెప్పలా కాపాడుకొని ముందు ముందు వచ్చే రాజకీయ అవకాశాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని గెలుపే లక్ష్యంగా పనిచేసి గ్రామ ప్రజల ఆదరణ పొందుతానని పాండు గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా నూతనంగా గెలుపొందిన నాగులపల్లి గ్రామ బిజెపి ఉప సర్పంచ్ సుమన్ గౌడ్ కాంగ్రెస్ వార్డు సభ్యులు వానరాశి స్వామి, గోడల బౌరయ్య ,రాసుమల్ల గూడా కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ శివరాములను శాలువాతో సన్మానించి గ్రామ అభివృద్ధికి బాటలు వేసి మంచి పేరు ప్రతిష్టలు పొందాలని నాగులపల్లి సీనియర్ నాయకులు అన్నారు.

**గెలిచినా ఓడినా మీ వెంటే ఉంటా...**

రాజకీయంలో గెలుపోటములు సహజమని గెలిచినా ఓడిన ప్రజల పక్షాన ఉంటూ ప్రజల కోసం ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పని చేస్తానని కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గడిగల పాండుగౌడ్ అన్నారు. ఏ కార్యకర్త కూడా ఏ విధమైన ఆందోళన చెందకుండా సమన్వయంతో ముందుకు వెళ్లాలని ముందు ముందు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసి ఏకతాటిగా అందరం కలిసికట్టుగా కలిసుందామని పిలుపునిచ్చారు.

గ్రామ అభివృద్ధిలో ఏ కార్యక్రమం జరిగినా ముందుండి నడిపిస్తామని తమకు ఎవరితో వివాదాలు లేవని అన్ని విధులు అభివృద్ధికి కృషి చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాములు గౌడ్ మాట్లాడుతూ..పార్టీ నాయకులు కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని ఏ ఆపద వచ్చిన తమ వెంట ఉండి అన్ని విధాల అండగా ఉంటామన్నారు. రాజకీయంలో గెలుపోటములు సహజమని గెలిచిన ఓడిన సమన్వయంతో ఉండి వచ్చే ఏ అవకాశాన్ని కూడా వదిలిపెట్టకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులమందరం ఏకమై కలిసికట్టుగా పనిచేద్దామని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో అందరికీ సమాన అవకాశాలు కల్పించే దిశగా నిర్ణయాలు తీసుకుని ప్రతి కార్యకర్త కాంగ్రెస్ పార్టీకి వెన్నుముక కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన రజిత పాండు గౌడ్ కు సహకరించిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపిన రాములు గౌడ్. పత్రికా విలేకరు శ్రీకృష్ణను ఆహ్వానించి సన్మానించిన నాయకులు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, నందిమల రాములు గౌడ్, ఆవుల రవి, నరసింహారెడ్డి, నరసింహచారి, డాక్టర్ ఆంజనేయులు, వెంకట్ రాములు , గణేష్, రవి,యాదయ్య, సుదర్శన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి,తూర్పాటి వెంకటేష్, బీరయ్య, సురేందర్ రెడ్డి, యువ నాయకులు... రాఘవేందర్ రెడ్డి, కొండా రెడ్డి, హరీశ్వర్ రెడ్డి, అనిల్, సతీష్, రాజు, సంతు, అంజి, రాజశేఖర్, శ్రీకాంత్, మహేష్, సంపత్ కుమార్, యాదగిరి, కుమార్, రాము, మహేష్, హనుమంతు, రమేష్, శ్రీను, రాఘవేందర్, శివ , అంజి,రామకృష్ణ, శ్రీకాంత్,ఆహ్వానితులు జర్నలిస్టు శ్రీకృష్ణ పాల్గొన్నారు.

# అమెరికాలో లోయలో పడ్డ కారు.. ఇద్దరు తెలుగు యువతుల మృతి





జయభేరి, మహబూబాబాద్ :

అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన ఇద్దరు యువతులు ప్రాణాలు కోల్పోయారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలానికి చెందిన పులఖండం మేఘనారాణి (25), ముల్కనూరుకు చెందిన కడియాల భావన (24) మూడేళ్ల కిందట ఉన్నత చదువుల కోసం తెలంగాణ నుంచి అమెరికాకు వెళ్లారు. అక్కడ ఎమ్మెస్ పూర్తి చేసిన వీరిద్దరూ ప్రస్తుతం జాబ్ సెర్చ్ చేస్తున్నారు. త్వరలో మంచి జాబ్ తెచ్చుకుని వారి కాళ్లపై నిలబడతారని భావిస్తే.. తీవ్ర విషాదం చోటుచేసుకుందని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మేఘన, భావన తమ మరో ఆరుగురు స్నేహితులతో కలిసి మొత్తం ఎనిమిది మంది రెండు కార్లలో కాలిఫోర్నియా టూర్కు బయల్దేరారు. ఈ క్రమంలో అలబామా హిల్స్ రోడ్డులోని ఒక మలుపు వద్ద వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో మేఘన, భావన మృతి చెందారు. అమెరికా కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. మంచి భవిష్యత్తు కోసం విదేశాలకు వెళ్లిన తమ బిడ్డలు ఇకలేరన్న నిజాన్ని వారి తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆ యువతుల స్వగ్రామాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

# ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

జయభేరి, సైదాపూర్ :





సైదాపూర్ మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఘనంగా కాంగ్రెస్ పార్టీ 141.వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు.. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, AMC చైర్మన్ దొంత సుధాకర్ గారు పార్టీ జెండా ఆవిష్కరించి మహనీయులకు నివాళులు అర్పించి పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

అనంతరం వారు మాట్లాడుతూ.. దేశ ప్రగతిలో పేదల సంక్షేమంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర కీలకమని, స్వాతంత్రం నుంచి సంక్షేమం వరకు దేశ ప్రగతికి కాంగ్రెస్ పార్టీ సేవలు అనిర్వచనీయం అన్నారు.. దేశ ప్రగతికి కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు తరతరాలకు స్ఫూర్తి అని.. తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన ప్రత్యేక రాష్ట్ర సాధనలో కాంగ్రెస్ పార్టీ పాత్ర చారిత్రాత్మకం.. ప్రజల భావోద్వేగాలని గౌరవిస్తూ రాజకీయ ధైర్యంతో తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు ఈ నిర్ణయం కోట్లాదిమంది తెలంగాణ ప్రజల జీవితాల్లో కొత్త ఆశలను అవకాశాలను తెచ్చిందని గుర్తుచేశారు.. 140 సంవత్సరాల చరిత్ర గల కాంగ్రెస్ పార్టీ కేవలం గతాన్ని స్మరించుకునే పార్టీ కాదు మారుతున్న కాలానికి అనుగుణంగా యువత ఆశయాలను అర్థం చేసుకుంటూ పేదలు రైతులు మహిళలు యువత సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అంటే ఒక రాజకీయ సంస్థ మాత్రమే కాదు అది ఒక ఉద్యమం ఒక భావజాలం ఒక నమ్మకం భారత ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సామాజిక న్యాయం సాధన కోసం దేశ ఐక్యత కోసం కాంగ్రెస్ పార్టీ ప్రయాణం నిరంతరం కొనసాగుతుందని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిధ గ్రామాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, AMC డైరెక్టర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధులు, వార్డు సభ్యులు, యూత్ కాంగ్రెస్ నాయకులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# ఒక పెళ్లి.. 3 సూసైడ్లు

జయభేరి, బెంగళూరురు, డిసెంబర్ 29 :

బెంగళూరులో కొత్త పెళ్లైన జంట వేర్వేరే చోట్ల ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రెండు రాష్ట్రాల మధ్య ఘర్షణకు దారి తీసింది. హనీమూన్ ట్రిప్ సందర్భంగా భర్తతో గొడవపడి నవ వధువు ఆత్మహత్య చేసుకున్న ఘటనలో ట్విస్టుల మీద ట్విస్టులు వెలుగు చూశాయి. గురువారం (డిసెంబర్ 25) వధువు ఆత్మహత్య తర్వాత ఆమె భర్త కూడా ఓ హోటల్‌లో సూసైడ్ చేసుకున్నాడు. నాగ్‌పూర్‌లో అతని తల్లి కూడా ఆత్మహత్యాయత్నం చేయడంతో ఈ వ్యవహారం టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. అసలేం జరిగిందంటే..బెంగళూరులో రెండు నెలల క్రితం ఓ ప్రైవేట్ కంపెనీ ఉద్యోగిగా ఉన్న సూరజ్ అనే వ్యక్తితో గణవి (26) అనే యువతితో వివాహం జరిగింది. అక్టోబర్ 29న గ్రాండ్ వివాహ రిసెప్షన్ కూడా జరిగింది. ఇందుకు వధువు తల్లిదండ్రులు దాదాపు రూ.40 లక్షలు ఖర్చు చేశారు. ఆ తర్వాత ఈ జంట 10 రోజుల క్రితం హనీమూన్‌కి శ్రీలంకకు వెళ్లారు. ఐతే అక్కడ ఈ జంట గొడవ పడటంతో ఐదు రోజుల్లోనే బెంగళూరుకు తిరిగి వచ్చారు. ఏం జరిగింతో తెలియదుగానీ నవ వధువు బుధవారం మధ్యాహ్నం అత్తింట్లో ఉరి వేసుకుని సూసైడ్ చేసుకుంది. గణవి సూసైడ్ తర్వాత ఆమె తల్లిదండ్రులు, బంధువులు అత్తింటి వారిపై వరకట్నం వేధింపులు, ఆత్మహత్యకు ప్రేరేపించడం వంటి నేరాల కింద కేసు పెట్టారు. వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆమె భర్త కుటుంబం వేధింపుల కారణంగా తీవ్ర ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.దీంతో కేసు నమోదైన తర్వాత మృతురాలి భర్త, అతని తల్లి జయంతి, సోదరుడితో కలిసి మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు పారిపోయాడు. భార్య మరణించిన 2 రోజుల తర్వాత భర్త సూరజ్ శివన్న (36) శుక్రవారం నాగ్‌పూర్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. శివన్న సూసైడ్ చేసుకున్న విషయాన్ని అతడి సోదరుడు సంజయ్ శివన్న నాగ్‌పూర్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఇంతలో శివన్న తల్లి బంధువుల ఇంట్లో ఆత్మహత్యకు ప్రయత్నించింది. వెంటనే ఆమెను రక్షించి ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె పరిస్తితి విషమంగా ఉంది. ప్రస్తుతం కర్ణాటక, మహారాష్ట్ర అధికారులు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన మాజీ సర్పంచ్ పై చర్యలు తీసుకోవాలి

జయభేరి, జనగామ :



మండలంలోని చౌడారం గ్రామంలో ఉన్న సర్వే నెంబర్ 10 లో గల ప్రభుత్వ భూమిని గత 30 సంవత్సరాల క్రితం భూమిలేని నిరుపేదలకు నాటి ప్రభుత్వం పంపిణీ చేయడం జరిగింది, ఆ యొక్క భూమిని ఆ పేద రైతులు దున్నుకుంటున్న క్రమంలో పక్క గ్రామమైన చిటాకోడూర్ గ్రామానికి చెందిన దివంగత కొత్త కేశవరెడ్డి వారిని బెదిరించి భయభ్రాతనకు గురిచేసి వారి ఆర్థిక స్థితిగతులను ఆసరా ఏమైనట్లుగా దొంగ కాగితాలు సృష్టించి ఆ యొక్క భూమిని తన ఆధీనంలోకి తీసుకుని దున్నుకొని సొమ్ము చేసుకుంటున్నారు అన్నారు. రాను రాను రోజులు గడిచినవి మొన్నటికి మొన్న పది సంవత్సరాల క్రితం వారు మనవడు అయిన చిటాకోడూర్ మాజీ సర్పంచ్ కొత్త దీపక్ రెడ్డి ఆ యొక్క భూమిని చదును చేసుకుంటూ ఉంటున్న క్రమంలో ఆ యొక్క చౌడారం గ్రామానికి చెందిన పేద రైతులు అయ్యా మా భూమి మీ తాతగారు మా వద్ద గుంజుకున్నారని మా భూమిని మీకు తోచినంత ఇచ్చి సహాయం చేయవలసిందిగా కాళ్ల వేలపడి బదిలాడినప్పటికీ ఇంటికి రండి మాట్లాడదామని రప్పించి తను పెంచుకుంటున్న ఇంటి కుక్కలను గేట్లు దగ్గర వేసి వదిలిపెట్టి పేద రైతులను భయభ్రాతులకు గురిచేసిన సంఘటన ఉన్నట్లు సమాచారం అయ్యా సంబంధిత అధికారులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులారా మా యొక్క బాధలను మా దళిత పేద రైతుల గాధను ఒక్కసారి ఆలోచించండి దయచేసి మా భూమిని మాకు ఇప్పించండి అంటూ కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు జిల్లా కలెక్టర్ గారికి ఫిర్యాదు చెయ్యడం జరిగింది ఫిర్యాదు స్వీకరించిన కలెక్టర్ గారు త్వరితగతిన విచారణ జరిపి ఆ యొక్క భూమి సంబంధించిన సమాచారం ఇవ్వాలని సంబంధిత అధికారులకు ఆదేశించడం జరిగింది.



# అతి వేగంగా కార్ ఢీకొట్టడంతో వృద్ధురాలికి తీవ్ర గాయాలు

జయభేరి, ఘట్కేసర్ :

పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధి అన్నోజిగూడ ఎస్ బి ఐ బ్యాంక్ ఎదురుగా అతివేగంతో కార్ ఢీకొట్టడంతో మృదురాలకి తీవ్ర గాయాలు అయ్యాయి. హైదరాబాదు నుండి వరంగల్ కి వెళ్తున్న కార్ అతివేగంతో అన్నోజిగూడ ఎస్ బి ఐ బ్యాంక్ ఎదురుగా రోడ్డు దాటుతుండగా వృద్దురాలి ఢీకొట్టడంతో కాలు విరిగింది. 108 సాయంతో వృద్ధురాలని ఆస్పత్రికి తరలించారు. కార్ డ్రైవర్ ని అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..

# కుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు

జయభేరి, రంగా రెడ్డి :

రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ వాసుదేవ రెడ్డి కాలనీలో మూడు సంవత్సరాల నిత్యశ్రీ అనే పాపపై వీధి కుక్కలు దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వీధి కుక్కలు పాపపై విచక్షణ రహితంగా దాడి చేయడంతో పాప మొహం పై 18 కుట్లు పడ్డాయి. వీధి కుక్కలు వీరంగం సృష్టిస్తూ స్థానిక ప్రజలపై దాడి చేస్తున్న ఘటనపై ఆన్లైన్ లో స్థానికులు జిహెచ్ఎంసి అధికారులకు ఫిర్యాదు చేసిన వారు పట్టించుకోకపోవడంతో ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

# సోయా రైతుల వింత నిరసన

జయభేరి, అదిలాబాద్ :

సొయా పంటను ప్రభుత్వానికి అమ్మడానికి మార్కెట్కు తీసుకురావడం మేము చేసిన తప్పని రైతులు ప్రశ్నించారు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని మార్కెట్లో ప్రభుత్వం నెల రోజుల నుండి తమ పంట కొనుగోలు చేయడం లేదని, మోకాళ్లపై కూర్చుని బుద్ధి లేక పంట పండించామని రైతులు నిరసన వ్యక్తం చేసారు.

# బంగ్లాదేశ్ లో హిందూవులపై దాడులు

- తెలంగాణ న్యాయవాదుల నిరసన

జయభేరి, హైదరాబాద్ :

బంగ్లాదేశ్లో అమాయక హిందువులపై జరుగుతున్న అమానుష దాడులు, చిత్రహింసలు, ప్రాణహానిని నిరసిస్తూ తెలంగాణ హైకోర్టు జాతీయవాద న్యాయవాదులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. బంగ్లాదేశ్లో అమాయక హిందువులపై విచక్షణారహితంగా దాడులు చేస్తూ, చిత్రహింసలకు గురిచేసి మానవ ప్రాణాలను హరిస్తున్న మతాంధత్వం, చాందసవాద విధానాలను తీవ్రంగా ఖండిస్తూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బంగ్లాదేశ్లో కొనసాగుతున్న ఈ మానవ హక్కుల ఉల్లంఘనలపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయవాదులు ఐక్యరాజ్య సమితిని డిమాండ్ చేశారు. మతాంధత్వంతో రెచ్చిపోతున్న ఈ హింసాకాండపై ఐక్యరాజ్య సమితి తక్షణమే జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# దానం బంపర్ ఆఫర్



జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 29:

సంక్రాంతి పండుగ వేళ పతంగుల సందడి మొదలైంది. ఈ తరుణంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రాణాంతకమైన చైనా మాంజా వినియోగాన్ని అరికట్టేందుకు ఆయన ఒక వినూత్నమైన ఆఫర్‌ను ప్రకటించారు. ఎవరైనా చైనా మాంజా విక్రయిస్తున్నట్లు సమాచారం అందిస్తే తన సొంత నిధుల నుండి రూ.5,000 నగదు బహుమతి ఇస్తానని వెల్లడించారు. చైనా మాంజా కారణంగా జరుగుతున్న అనర్థాలపై దానం నాగేందర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "చైనా మాంజా కేవలం దారం కాదు.. అది ఒక మృత్యుపాశం. దీనివల్ల అమాయక పక్షులు గాలిలో ప్రాణాలు వదులుతున్నాయి. బైక్‌లపై వెళ్లే ప్రయాణికులు మెడకు తట్టుకుని తీవ్ర గాయాలపాలవుతున్నారు. కొన్నిసార్లు ప్రాణాలు కూడా పోతున్నాయి" అని ఆయన అన్నారుఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో ఎవరైనా వ్యాపారులు లాభాపేక్షతో చైనా మాంజాను విక్రయిస్తే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే దానం హెచ్చరించారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లు, ఫోన్ నంబర్లు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఆయన హామీ ఇచ్చారు. నిబంధనలు ఉల్లంఘించి మాంజా అమ్ముతున్న షాపులపై పోలీసుల ద్వారా కేసులు నమోదు చేయిస్తామన్నారు. సమాచారం నిజమని తేలితే వెంటనే రూ.5,000 నగదును బహుమతిగా అందజేస్తామన్నారు. వ్యాపారులతో పాటు తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ఏ రకమైన దారాన్ని వాడుతున్నారో గమనించాలని దానం కోరారు. పర్యావరణానికి, ప్రాణాలకు హాని కలిగించే వస్తువులను బహిష్కరించి, పండుగను సురక్షితంగా జరుపుకోవాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధి ఎంత ముఖ్యమో, ప్రజల ప్రాణరక్షణ కూడా అంతే ముఖ్యమని దానం నాగేందర్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే తీసుకున్న ఈ నిర్ణయంపై పర్యావరణ ప్రేమికులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఏ. శైలజకు శుభాకాంక్షలు

జయభేరి, మేడిపల్లి :




GHMC పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఏ. శైలజని, సర్కిల్ కార్యాలయంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ, మేడిపల్లి పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా సమయం కేటాయించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. దీనిపై డిప్యూటీ కమిషనర్ ఏ. శైలజ సానుకూలంగా స్పందిస్తూ, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మేడిపల్లి కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, మాధుసూదన్ రెడ్డి,, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షులు ప్రభు, మల్లం వెంకటేష్ గౌడ్, యాసారం శ్రీనివాస్, పాశం నరేందర్ రెడ్డి, బుల్లెట్ శంకర్, కోనేటి వెంకట్, అమర్ పటేల్, కిరణ్ నాయక్, కళ్యాణి పాల్గొన్నారు.



# పోలీసు కమిషనరేట్ లో మార్పులపై ప్రతిపాదనలు

- కొత్త ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ లోకి

జయభేరి, హైదరాబాద్ :

ప్రస్తుతం రాచకొండ సైబరాబాద్ కమిషనరేట్లలో ఉన్న మహేశ్వరం జోన్, చేవెళ్ల, షాద్‌నగర్ డివిజన్ లు: కొత్తగా ఏర్పాటు చేసే ఫ్యూచర్‌సిటీ కమిషనరేట్‌లోకి ఫ్యూచర్ సిటీ ప్రాంతంతోపాటు ప్రస్తుతం రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్లలో ఉన్న మహేశ్వరం జోన్, చేవెళ్ల, షాద్‌నగర్ డివిజన్లను చేర్చనున్నారు. ప్రస్తుతం సైబరాబాద్ పరిధిలో ఉన్న రాజేంద్రనగర్, శంషాబాద్ మున్సిపల్ జోన్లు హైదరాబాద్ కమిషనరేట్‌లోకి వెళ్లనున్నాయి. ఈ క్రమంలో అమీన్‌పూర్, పటాన్‌చెరు, ఐడీఏ బొల్లారం ప్రాంతాలను సైబరాబాద్‌లో కలిపే ప్రతిపాదన ఉంది. రాచకొండ కమిషనరేట్ పరిధిలోకి మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్బీనగర్. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోకి శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ మున్సిపల్ జోన్లు రానున్నాయి. రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉన్న యాదాద్రి భువనగిరి జోన్ మొత్తాన్ని తీసేసి.. పోలీస్ జిల్లాగా మార్చి ఎస్పీ స్థాయి అధికారిని నియమించనున్నట్టు సమాచారం. ఇక నార్త్ జోన్ పరిధిలోని తిరుమలగిరి నుంచి తుకారాంగేట్ ప్రాంతం వరకు, సైబరాబాద్ పరిధిలోని శామీర్‌పేట జీనోమ్ వ్యాలీని రాచకొండ కమిషనరేట్ పరిధిలోకి చేర్చనున్నారు. ఇక సౌత్, సౌత్‌వెస్ట్ జోన్లను చార్మినార్, గోల్కొండ జోన్‌లుగా.. నార్త్ జోన్‌ను సికింద్రాబాద్ జోన్‌గా మార్చేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.

# డబ్బుల కోసం జీహెచ్ఎంసీని అడ్డగోలుగా విభజించారు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 29 :

జీహెచ్ఎంసీని అడ్డగోలుగా విభజించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. జీహెచ్ఎంసీ డీలిమిటేషన్ కేవలం డబ్బుల కోసం చేస్తున్నదనే అని అన్నారు. మర్చంట్ బ్యాంకర్ బ్రోకర్ చెప్పినట్లుగా రేవంత్ రెడ్డి చేస్తున్నారని మండిపడ్డారు.అసెంబ్లీలో మీడియాతో కేటీఆర్ చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీని మూడు ముక్కలు చేస్తున్నారని మండిపడ్డారు. ఫోర్త్ సిటీ అని పెట్టాడని.. దాన్ని కూడా తొందరలో ఏదో కార్పొరేషన్ చేస్తాడు కావచ్చని ఎద్దేవా చేశారు. ఏం చేసినా శాస్త్రీయంగా ఉండాలని.. కానీ ఇష్టమొచ్చినట్లు చేస్తే ఊరుకోరని తెలిపారు. వీటన్నింటికీ సమాధానం చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు. జీహెచ్ఎంసీ డివిజన్ల విభజనపై సభలో చర్చకు పెట్టాలని డిమాండ్ చేశారు. చర్చలో అన్ని విషయాలపైనా తాము మాట్లాడతామని స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీలో కాంగ్రెస్, ఎంఐఎం ఏం చేకుంటారో.. ఎవరికి లాభం చేకూర్చేలా చేసుకుంటారో వాళ్లిష్టమని అన్నారు. కానీ తమకు మాత్రం 2016లో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నిక చారిత్రాత్మక ఎన్నిక అని తెలిపారు. అలాంటి ఎన్నికలు ఇప్పటివరకు చూడలేదని.. మళ్లీ చూడబోమని చెప్పారు. గతంలో ఓల్డ్ సిటీలో కూడా బీఆర్ఎస్ రెండు సీట్లు గెలిచామని గుర్తుచేశారు. గతంలో మేం గెలిచిన సీట్లు ఇంకా ఎవరు గెలవలేరని వ్యాఖ్యానించారు.అసెంబ్లీలో కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి షేక్‌హ్యాండ్ ఇవ్వడంపైనా కేటీఆర్ స్పందించారు. కేసీఆర్ అంటే గౌరవం ఉంటే చాలని అన్నారు. తెలంగాణ తెచ్చిన నాయకుడిగా కేసీఆర్ పట్ల తెలంగాణలో ప్రతి ఒక్కరికీ గౌరవం ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రికి సభలో కేసీఆర్‌ను కలిసేంత సంస్కారం ఉంటే చాలని.. ఇదే సంస్కారం బయట మాటల్లో కూడా ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించారు. రాజకీయ ప్రత్యర్థులు ఒకరినొకరు పలకరించుకునేంత సానుకూల వాతావరణం ఉంటే మంచిదేనని అన్నారు.



# ఆ రోజే పెళ్లికి ముహూర్తం?

అగ్ర తారలు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న అక్టోబర్‌లో నిశ్చితార్థం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే ఎంగేజ్‌మెంట్ విషయంలో వారిద్దరూ గోప్యతను పాటిస్తున్నారు. ఎక్కడా దాని గురించి మాట్లాడటానికి ఇష్టపడటం లేదు. సరైన సమయంలో అన్ని వివరాలను వెల్లడిస్తారని వారి సన్నిహితులు అంటున్నారు. గత నెలలో జరిగిన 'ది గర్ల్‌ఫ్రెండ్' సక్సెస్‌మీట్‌లో ఈ జంట తళుక్కున మెరిశారు. అదే వేదికపై విజయ్‌ని పొగడ్తల్లో ముంచెత్తింది రష్మిక. దాంతో ఈ జంట పెళ్లి ఖాయమని నిర్ధారణకొచ్చారు అభిమానులు. తాజా సమాచారం ప్రకారం ఫిబ్రవరి 26న విజయ్‌రష్మిక రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ ప్యాలెస్‌లో పెళ్లిపీటలెక్కబోతున్నారని సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతున్నది. కొద్దిమంది కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషుల సమక్షంలో ఘనంగా పెళ్లికి ఏర్పాట్లు చేయబోతున్నారు. అనంతరం హైదరాబాద్‌లో రిసెప్షన్ ఉంటుందని చెబుతున్నారు. అయితే ఈ వార్తల్లో నిజమెంతో తెలియాలంటే విజయ్‌రష్మికల్లో ఎవరో ఒకరు స్పందించాల్సిందేనని, అప్పటివరకు వారి పెళ్లి తేదీపై సస్పెన్స్ కొనసాగుతూనే ఉంటుందన్నది అభిమానుల మాట.

# ఢిల్లీ హైకోర్టుకు జూనియర్ ఎన్టీఆర్ కృతజ్ఞతలు



టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ తన వ్యక్తిగత హక్కులను కాపాడాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు అనుకూల తీర్పు ఇవ్వడం తెలిసిందే. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్, ఈ-కామర్స్ వెబ్‌సైట్లలో తన పేరు, ఫొటోలు, వీడియోలను అనుమతి లేకుండా వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగించడం వల్ల తన వ్యక్తిగత హక్కులకు భంగం కలుగుతోందని ఎన్టీఆర్ కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, నటుడి వ్యక్తిగత హక్కులను రక్షించేలా కీలక ఉత్తర్వులు జారీ చేస్తూ తారక్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో జూనియర్ ఎన్టీఆర్ తాజాగా ఢిల్లీ హైకోర్టుకు కృతజ్ఞతలు తెలిపారు. డిజిటల్ యుగంలో వ్యక్తిగత హక్కుల ప్రాధాన్యతను గుర్తించి రక్షణాత్మక ఉత్తర్వులు జారీ చేసినందుకు కోర్టుకు ధన్యవాదాలు చెప్పారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. "నేటి డిజిటల్ యుగంలో నా వ్యక్తిగత హక్కులను కాపాడే రక్షణాత్మక ఉత్తర్వును మంజూరు చేసినందుకు ఢిల్లీ హైకోర్టుకు నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. సుప్రీంకోర్టు న్యాయవాదులు డాక్టర్ బాలాజీ శ్రీనివాసన్, డాక్టర్ అల్కా దాకర్‌లకు, అలాగే రాజేందర్, రైట్స్ & మార్క్స్ బృందం అందించిన లీగల్ సపోర్ట్‌కు నా కృతజ్ఞతలు. మీ స్థిరమైన మద్దతుకు హృదయపూర్వక ధన్యవాదాలు" అని ఎన్టీఆర్ పేర్కొన్నారు. ఈ పోస్టుకు #Justice #PersonalityRights #DigitalAge అనే హ్యాష్‌ట్యాగ్‌లను కూడా జోడించారు. ఈ తీర్పు సెలబ్రిటీల వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణలో కీలక మైలురాయిగా మారిందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో అనుమతి లేకుండా సెలబ్రిటీల పేర్లు, చిత్రాలు, వీడియోలు వినియోగించే అంశాలపై ఈ తీర్పు ప్రభావం చూపే అవకాశముందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇక ఎన్టీఆర్ చివరిగా వార్ 2 చిత్రంతో ప్రేక్షకులని పలకరించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో క్రేజీ ప్రాజెక్ట్ చేస్తున్నాడు.



# అది అనుకోని అదృష్టం

అటు బాలీవుడ్, ఇటు టాలీవుడ్‌కి సమ ప్రాధాన్యతనిస్తూ లౌక్యంతో ముందుకెళ్తున్నది కథానాయిక మృణాల్ ఠాకూర్. తెలుగులో 'సీతారామం'లో సీతగా ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన మృణాల్, నాని 'హాయ్ నాన్న'తో తెలుగులో ద్వితీయ విఘ్నాన్ని సైతం అధిగమించింది. మూడో సినిమా 'ఫ్యామిలీ స్టార్' కాస్త డిజప్పాయింట్ చేసినా.. త్వరలో 'డెకాయిట్'తో మరోసారి తెలుగులో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నది మృణాల్ ఠాకూర్. రీసెంట్‌గా సౌత్‌లో తన సినీ ప్రయాణం గురించి మృణాల్ మాట్లాడుతూ 'అసలు దక్షిణాది సినిమాల్లో నటించడం అనేది నా ప్రణాళికల్లో లేదు. నేను సౌత్ సినిమాలు నటిస్తానని అస్సలు అనుకోలేదు కూడా. ఓ విధంగా అది నాకు అనుకోకుండా దొరికిన అదృష్టం. 'సీతారామం' తర్వాత నా విషయంలో బాలీవుడ్ దర్శక, నిర్మాతల దృక్కోణం కూడా మారింది. అందుకే తెలుగు సినిమాకు ఎప్పుడూ రుణపడి ఉంటా' అని తెలిపింది మృణాల్ ఠాకూర్. ఇంకా చెబుతూ 'వచ్చే ఏడాది 'డెకాయిట్'తో మరోసారి టాలీవుడ్ తెరపై కనిపించబోతున్నా. ఆడియన్స్‌కి స్వీట్ షాక్ ఇచ్చే సినిమా ఇది. ఓ కొత్త కథను తెరపై చూస్తారు. నా క్యారెక్టర్ మీ ఊహలకు మించి ఉంటుంది' అని పేర్కొన్నది మృణాల్ ఠాకూర్.



# తోడు ఉంటాడనుకుంటే వాడుకుని వదిలేశాడు..

బిగ్ బాస్ 6 ద్వారా తెలుగు రాష్ట్రాల్లో పాపులర్ అయ్యింది ఇనయా సుల్తానా. ఆ షో నుంచి బయటకు వచ్చిన తర్వాత నెట్టింట మరింత యాక్టివ్ అయ్యింది. తన తీరు, గ్లామర్ ఆరబోతపై ఎన్ని విమర్శలు వచ్చినా.. తగ్గేదేలే అన్నట్లుగా వరుస పోస్టులతో రచ్చ చేసింది. ముఖ్యంగా తన ప్రియుడితో కలిసి ఇనయా షేర్ చేసిన పోస్టులు సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలకు దారితీసిన సంగతి తెలిసిందే. ఇదెలా ఉంటే.. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ అమ్మడు తన పర్సనల్ లైఫ్, కెరీర్ గురించి పలు విషయాలు పంచుకుంది. ఒంటరితనం, మానసిక ఒత్తిడి, నార్సిసిస్టిక్ ప్రవర్తన గల వ్యక్తులతో ఎదురైన పరిస్థితుల గురించి చెప్పుకొచ్చింది. తన కెరీర్‌లో ఎదురైన ఇబ్బందులను, ముఖ్యంగా తెలుగు ఇండస్ట్రీలో గుర్తింపు కోసం చేసిన పోరాటాన్ని ఇనయా సుల్తానా పంచుకున్నారు. ప్రస్తుతం తాను 67 సినిమాల్లో నటిస్తున్నానని వెల్లడించారు. బిగ్ బాస్ నుంచి వచ్చిన తర్వాత ఆమె ఎదుర్కొన్న మానసిక సవాళ్లను వెల్లడించారు. ఒక లవ్ ట్రాక్‌లో చిక్కుకుని తీవ్ర డిప్రెషన్‌కు గురైనట్లు తెలిపారు. ఒంటరితనం, తనకంటూ ఎవరూ లేరన్న భావనతో మోసపోయినట్లు చెప్పారు. ఆ వ్యక్తి తన పేరును, డబ్బును ఉపయోగించుకుని వదిలేశాడని ఇనయా చెప్పుకొచ్చింది. ఆ బంధం ప్రేమ కాదని, మానిప్యులేషన్ అని తెలిపింది. వారి మధ్య కనెక్షన్ తన తండ్రి లేని లోటును పూడ్చేదిగా భావించానని, ఆయనకు కూడా తండ్రి లేకపోవడంతో "బహుశా అతను నన్ను అర్థం చేసుకుంటాడేమో" అని నమ్మానని వివరించారు. అయితే, ఆ వ్యక్తి తన ఫేమ్‌ను వాడుకున్నాడని ఆమె చెప్పారు. తాను తన జీవితాన్ని ఆ వ్యక్తితోనే ఊహించుకున్నానని, అందుకే అంతగా నమ్మానని తెలిపింది.

# రాంచరణ్ సినిమాలో చాన్స్ కొట్టేసిన కన్నడ భామ!





వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. రంగస్థలం సినిమాలో సమంత క్యారెక్టర్ ఎంత పాపులర్ అయ్యిందో చెప్పనక్కరలేదు. అదే తరహాలో సుకుమార్ సినిమాలో హీరోయిన్‌కు కూడా మంచి పేరు వస్తుంది. ఇప్పుడు వీరిద్దరి కాంబోలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో యంగ్ హీరోయిన్‌ను ఎంపిక చేసినట్టు వార్తలు వస్తున్నాయి. కన్నడ ఇండస్ట్రీ నుంచి వచ్చిన ఆ యంగ్ హీరోయిన్ ఇటీవల సౌత్‌లో భారీ క్రేజ్ సంపాదించింది.

సప్త సాగరాలు దాటి సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న ఆమె కాంతార చాప్టర్ 1లో నటించి మరింత ఫేమస్ అయింది. ప్రస్తుతం యష్ టాక్సిక్, ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో బిజీగా ఉంది. ఈమెకు తెలుగు ప్రేక్షకుల్లో మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. ఇప్పుడు చరణ్ సినిమాలో ఆమె ఎంట్రీ గురించి టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం పెద్ది షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు చెర్రీ. ఆ సినిమా పూర్తయిన తర్వాత ఈ ప్రాజెక్ట్ స్టార్ట్ అవుతుంది. హీరోయిన్ ఎంపిక ఖరారు అయితే ఆమె కెరీర్ మరో స్థాయికి చేరినట్టేనని అభిమానులు అనుకుంటున్నారు.

## బంపర్ ఆఫర్..

రామ్ చరణ్ - సుకుమార్ కాంబినేషన్‌లో రానున్న RC17 సినిమాలో హీరోయిన్‌గా రుక్మిణి వసంత్ ఎంపికైందని ఇండస్ట్రీ వర్గాల్లో బజ్ నడుస్తోంది. సుకుమార్ స్క్రిప్ట్‌కు ఆమె క్యారెక్టర్ పర్ఫెక్ట్‌గా సెట్ అవుతుందని టాక్. రుక్మిణి వసంత్ కన్నడంలో బీర్బల్‌తో డెబ్యూ ఇచ్చినా సప్త సాగరాలు దాటి, కాంతార చాప్టర్ 1తో గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పుడు ఈ ఆఫర్ నిజమైతే ఆమె దశ మారిపోనుంది.

## చరణ్ సినిమాతో మరింత బూస్ట్?

రుక్మిణి వసంత్ ప్రస్తుతం ఎన్టీఆర్ ప్రాజెక్ట్‌లో నటిస్తోంది. యష్ టాక్సిక్ కూడా లైన్‌లో ఉంది. రామ్ చరణ్ సినిమా కూడా ఓకే అయితే బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా ప్రాజెక్టులు ఆమెకు దక్కనున్నాయి. సుకుమార్ ప్రీప్రొడక్షన్ వర్క్స్ చేస్తున్నాడు. 2026 సమ్మర్‌లో షూటింగ్ స్టార్ట్ అవుతుందని సమాచారం. రంగస్థలం తర్వాత ఈ కాంబోలో సినిమా కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. రుక్మిణి ఎంపిక ఖరారు అయితే మెగా ఫ్యాన్స్ సూపర్ ఖుషీ అవుతారు. రుక్మిణి వసంత్ తెలుగులో మంచి ఫ్యాన్ బేస్ సంపాదించింది. ఆమె అభినయం, అందంతో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. రామ్ చరణ్ సరసన నటిస్తే మరింత రేంజ్ పెరగనుంది. అధికారిక అనౌన్స్‌మెంట్ కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**